



పాస్‌పోర్టులకు పోలీస్ క్లియరెన్స్ కష్టాలు!

- గడువు తీరిన డిజిటల్ కీ
- ఎస్పీ ఆఫీస్‌లో దరఖాస్తుల పెండింగ్
- అత్యవసర జారీలోనూ జాప్యం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒకరి నిర్లిప్తత.. మరొకరిని ఆందోళనకు గురిచేయడం అంటే ఇదేనేమో!. జిల్లా పోలీసు కార్యాలయంలోని పాస్‌పోర్టు సెల్‌లో డిజిటల్ కీ గడువు ముగియడంతో పోలీస్ క్లియరెన్స్‌లు ఆగిపోయాయి. దీంతో అత్యవసర విధానంలో పాస్‌పోర్టు జారీకోసం సాధారణం కంటే ఎక్కువ ఫీజు చెల్లించి తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సైతం నిరీక్షించక తప్పడం లేదు. జిల్లాలోని ఎవరు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా పోలీసుల నిరభ్యంతరపత్రం కోసం ఎస్పీ కార్యాలయానికి పాస్‌పోర్టు అధికారులు పంపిస్తారు. అక్కడి నుంచి సంబంధిత పోలీస్ స్టేషనుకు సమాచారం వెళుతుంది. వాళ్లు దరఖాస్తుదారు ఇంటికి వెళ్లి ఆయన పాస్‌పోర్టు కార్యాలయానికి సమర్పించిన పత్రాలను భౌతికంగా పరిశీలిస్తారు. అడ్రసు, దరఖాస్తుదారుడిని భౌతికంగా నిర్ధారించుకుంటారు. అభ్యర్థితో సంబంధిత పత్రాలపై సంతకాలు తీసుకుంటారు. ఎలాంటి ఇబ్బందీ లేకపోయినా ఒకవేళ ఉన్నా ఆ సమాచారాన్ని ఎస్పీ కార్యాలయానికి పంపిస్తారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఎస్పీ కార్యాలయంలో మళ్లీ ఆ పత్రాలను ఒకసారి పరిశీలించి పోలీసుల అంగీకారం/తిరస్కరణ సమాచారాన్ని పాస్‌పోర్టు కార్యాలయానికి తెలియజేస్తారు. పోలీసులు అంగీకరిస్తేనే పాస్‌పోర్టు జారీ అవుతుంది. పోలీసుల అభిప్రాయాన్ని పాస్‌పోర్టు కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపించడానికి ఎస్పీ డిజిటల్ సిగ్నేచర్‌తో కూడిన ఒక తాళం (డిజిటల్ కీ) ఉంటుంది. అది కంప్యూటర్‌కి అనుసంధానిస్తే గానీ ప్రక్రియ పూర్తి కాదు. ఈ ప్రక్రియను జిల్లా పోలీసు కార్యాలయంలోని పాస్‌పోర్టు సెల్ చూసుకుంటుంది. ఇప్పుడు పోలీస్ క్లియరెన్స్‌లో సరిగ్గా చివరి అంకమైన డిజిటల్ కీ దగ్గర ఇబ్బంది వచ్చింది. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల అభ్యర్థుల పాస్‌పోర్టు దరఖాస్తులకు సంబంధించి పోలీస్ క్లియరెన్స్ వెళ్లకపోవడంతో పాస్‌పోర్టుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా పోలీసు కార్యాలయంలోని డిజిటల్ కీని ప్రతి ఏడాదీ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగియడానికి ముందుగానే ఢిల్లీలోని కేంద్ర హోంమంత్రిత్వశాఖకు దరఖాస్తు పంపిస్తే.. అక్కడి నుంచి విశాఖపట్నంలోని రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయానికి కీ జారీకి అనుమతి వెళుతుంది. అప్పుడు ఎస్పీ అనుమతి పత్రంతో ఇక్కడి నుంచి పోలీస్ వెళ్లి డిజిటల్ కీని తీసుకురావాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి 28తో డిజిటల్ కీ గడువు ముగిసింది. అయితే ఫిబ్రవరిలోనే రెన్యూవల్‌కి దరఖాస్తు చేసినట్టు చెబుతున్నారు. కానీ చొరవ కరువు కావడంతో ఇప్పటికీ రెన్యూవల్ కాలేదు. దీంతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ విషయం తెలియకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఏ కారణంతో ఆగిపోయిందో అనే అయోమయం నెలకొంది. కొందరు అత్యవసరంగా విదేశాలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉంటాయి. విద్యార్థులు, మెడికల్ ఎమర్జెన్సీల విషయంలో ఈ అవసరత ఎక్కువగా ఉంటుంది. పాస్‌పోర్టులు జారీ ఆలస్యం కావడంతో అత్యవసరంగా వెళ్లడం కోసం తత్కాల్ విధానంలో పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు మరీ ఆందోళన చెందుతున్నారు. వాళ్లకు ఆలస్యంపై కనీసం సమాచారం కూడా లేదు. రాజానగరం పోలీస్ స్టేషను పరిధిలో నివాసం ఉంటున్న ఓ విద్యార్థిని గత నెలలో తత్కాల్ విధానంలో పాస్‌పోర్టు దరఖాస్తు చేసుకున్నారు. అదే నెల 27న రాజానగరం పోలీసులు నివేదికను ఎస్పీ కార్యాలయానికి పంపించినట్టు పాస్‌పోర్టు సేవా పోర్టల్ చూపెడుతోంది. ఆరు రోజులు గడిచినా ఇంకా పోలీసుల నిరభ్యంతర ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఆమె తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇలాగే పలువురు అభ్యర్థుల పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా దృష్టి సారించి సమస్యను తక్షణమే పరిష్కరించడానికి చొరవ చూపాలని వారు కోరుతున్నారు.



బొమ్మూరులోని టిడ్కో గృహ సముదాయం

ఎన్నాళ్లీ.. నిరీక్షణ!

- చంద్రబాబు కలల ప్రాజెక్టు టిడ్కో
- ప్రభుత్వమొస్తే కష్టాలు తీర్చేస్తామని ఎన్నికల హామీ
- వచ్చి పది నెలలు దాటినా అడుగు ముందుకు పడని వైనం
- జూన్ 12 నాటికి ఇళ్లు అప్పగించాలని తాజా లక్ష్యం
- మౌలిక సదుపాయాలు లేకుండా ఎలా ఉండేదని లబ్ధిదారుల ప్రశ్న
- ఉన్న ఫ్లాట్లూ అస్తవ్యస్తం.. తాగునీరే లేని దుస్థితి
- నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి టిడ్కో సమావేశం

పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం పెద్దఎత్తున జరిగింది. అపార్టుమెంటు తరహాలో చేసిన ఈ ఇళ్ల కోసం లబ్ధిదారులు పోటీపడ్డారు. సర్వహంగులతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలుగా నిర్మించిన ఈ భవనాలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. దశల వారీగా చేపట్టిన ఈ ఫ్లాట్ల నిర్మాణం తొలి దశ పూర్తికావడంతో లబ్ధిదారులకు అందించారు. మలి దశ ఫ్లాట్ల నిర్మాణమూ పూర్తయింది. కానీ ఈలోపు ఎన్నికలు రావడంతో గృహ ప్రవేశాలు చేసుకుందామని సిద్ధమైన వారికి ఆ అవకాశం చిక్కలేదు. ఎన్నికలయ్యాక వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీలను గాలికి వదిలేసింది. లబ్ధిదారులు ఎన్నిసార్లు ప్రాథేయపడినా ఏదొక నెపంతో ఐదేళ్లు కాలం గడిపేసింది. మౌలిక సదుపాయాలనూ పట్టించుకోలేదు. తమ పార్టీ రంగులు వేసి మమ అనిపించింది. దీంతో మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే తమ ఇళ్లకు మోక్షం కలుగుతుందని లబ్ధిదారులంతా ఎదురు చూశారు. అనుకున్నట్టుగానే చంద్రబాబు సీఎం అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు కావొస్తోంది. ఇప్పటికీ వీరి కష్టాలు తీరలేదు. చంద్రబాబు రాగానే ఈ కాలనీల తీరే మారిపోతుందని కలలు గన్న వారి ఆశలు తీరనేలేదు. ఇప్పటికైనా కాస్త మా కాలనీల వైపు చూడండయ్యా అంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యేలను, అధికారులనూ వేడుకొంటున్నారు. నిజానికి జూన్ 12 నాటికి టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో చొరవ లేదు. పైగా మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎలా ఉంటామని లబ్ధిదారుల ప్రశ్న. ఈ నేపథ్యంలో ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో టిడ్కో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం జరగనుంది. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించే అవకాశం ఉంది.



బొమ్మూరులో బాగు ఏదీ..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో 2014-19 మధ్య పేదవాని సొంతింటి కలను నిజంచేస్తూ బొమ్మూరులో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలను చేపట్టి 99 శాతం పూర్తి చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ గృహాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించలేకపోయింది. దాంతో ఐదేళ్ల పాటు 6,304 మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల కోసం ఎదురుచూశారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వరకైనా తమ ఇళ్లను అప్పగించాలని వేడుకుంటూనే ఉన్నారు. చివర్లో మాత్రం వైసీపీ రంగులు ఆ భవనాలకు వేసి హడావుడి చేసింది. కానీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఈలోపు ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయ్యారు. తమ కష్టాలు తొలగినట్టేనని లబ్ధిదారులు సంతోషపడ్డారు. కానీ అధికారంలోకి పది నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అప్పగించలేదు. మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం బొమ్మూరులో ఉన్న టిడ్కో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకుల కనెక్టింగ్ చేయాల్సి ఉంది. అలానే తొర్రేడులో ఉన్న టిడ్కో గృహాల వద్ద రహదారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది.

పరిశీలన

అసౌకర్యాల చెరలో బోడసకుర్రు గృహాలు

తాగునీరు.. డ్రైనేజీ సమస్యలు

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహ సముదాయాలు నేడు అసౌకర్యాల చెరలో చిక్కుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలకు రంగులు అయితే మార్చిందిగానీ నివాస గృహాల యజమానులకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఆయా టిడ్కో గృహాల్లో నివశిస్తున్న నివాసితులు నిరంతరం కష్టాలతోనే జీవనం గడుపుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురంలో 2017లో టిడ్కో గృహాల సముదాయానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణంలో జాప్యం వల్ల లబ్ధిదారులు ఎంపికైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకైతే అందించారుగానీ అక్కడ కనీస సౌకర్యాల కల్పన చేపట్టలేదు. అమలాపురం పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లవరం మండలం బోడసకుర్రు శివారు దేవర్లంక బ్లోఅవుట్ సైట్ సమీపాన 2017లో 1632 టిడ్కో గృహాలను నిర్మించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకు 1576 గృహాలను అందించారు. వాటిలో ఇంకా 56 గృహాలను అర్హులకు అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 550 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటుండగా వెయ్యికి పైగా గృహాలు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఇక సెకండ్ ఫేజ్‌లో 962 ఇళ్లు నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రతిపాదనను ప్రభుత్వం దాదాపు విరమించుకున్నట్టే. ఇక్కడ మంచినీటి సమస్యతో డ్రైనేజీ సమస్య ఉంది. తాగునీరు లేకపోవడంతో అక్కడ నివాసం ఉండేందుకు ఎవరూ వెళ్లడం లేదు. పదిరోజులకోసారి బోడసకుర్రు టిడ్కో గృహాలకు మున్సిపల్ వాటరు ట్యాంకరు ద్వారా నీళ్లు పంపిస్తున్నారు. జనసేన నుంచి ఒక ట్యాంకరు ద్వారా నీళ్లు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి టిడ్కో గృహాల వద్దే రేషన్‌ను తీసుకునే సదుపాయం కల్పించినా పెన్షన్లు మాత్రం అమలాపురం పట్టణంలో వారి వారి వార్డులకు వెళ్లి 1వ తేదీన తీసుకోవాల్సిందే.





కాకినాడలోనూ అంతే..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేటలో టిడ్కో గృహ సముదాయం ఉంది. ఇక్కడ తొలిఫేజ్‌లో 1152ఇళ్లు నిర్మించగా వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. రెండో ఫేజ్‌లో 800 ఫ్లాట్లు నిర్మించగా లబ్ధిదారులకు అందించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం జరిగినా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిపట్ల పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీంతో ఇప్పటివరకు తాగునీటి పైప్‌లైన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించలేదు. ఈ సముదాయంలోని వాటర్ సంప్ పరిసరాలు అపరిశుభ్రంగా మారగా, సీవేజ్ వాటర్ డ్రెయిన్ దెబ్బతింది. ఇక ఏ వస్తువు కావాలన్నా దూర ప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు మహిళా మార్ట్ భవనం నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది.



వాలుతిమ్మాపురంలో ఎదురుచూపులే..

పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వాలుతిమ్మాపురంలో నిర్మించిన టిడ్కో భవనాలు రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మొదటి విడతలో 1724 ఇళ్లను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. రెండో విడతలో 1672 ఇళ్లను నిర్మించింది. ఈలోపు వైసీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. దీంతో రెండో విడతలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించలేదు. 500 ఇళ్లకు వైరింగ్ చేయాల్సి ఉంది.

కొవ్వూరులో అసౌకర్యాల చెరలో టిడ్కో ఇళ్లు



కొవ్వూరు,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి):గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో గృహాలు ఇప్పటికీ లబ్ధిదారులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. మెరుగైన వసతులతో ఈ గృహాల నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుగా వాటిని పక్కనపెట్టేసింది. దీంతో ఆ భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా మారింది. కొవ్వూరు మునిసిపాలిటీ పరిధిలోని పెద తాళ్లపుంతలోని ఎన్టీఆర్ నగర్‌లో 2018లో రూ.31.27 కోట్ల వ్యయంతో 480 గృహాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 300 చదరపు అడుగుల సింగిల్ బెడ్‌రూమ్ గృహాలు 240, 430 చదరపు అడుగుల డబుల్ బెడ్ రూమ్ గృహాలు 240 నిర్మాణం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు గృహ నిర్మాణాలు పూర్తికాగా, తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకుండానే బ్యాంకు వాయిదాలు కట్టుకోవాల్సిన వస్తోందన్నారు. తక్షణం వాటిని లబ్ధిదారులు అప్పగించాలని కోరారు. కాగా కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ జూన్ 12 నాటికి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు.

నిడదవోలులో మోక్షం ఎప్పుడో..



నిడదవోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిడదవోలు పట్టణంలోని తీరుగూడెంలో 1152 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టింది. తుది దశలో ఉండగా ఎన్నికలు రావడం, తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు మూలనపడింది. వైసీపీ ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తిరిగి చంద్రబాబు సీఎం అయితే తమకు ఇళ్లు దక్కుతాయని లబ్ధిదారులు ఎదురుచూశారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలైనా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం, మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి ప్రగతి లేదు. దీంతో లబ్ధిదారులంతా తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు.

అగ్నివీర్ దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 10

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అగ్నిపథ్ పథకం 2025-26 కింద అగ్నివీర్ ఉద్యోగాలకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. అగ్నివీర్ కోసం ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ ఉంటుందని, దానికి ఈనెల 10వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ 10వ తరగతి, ట్రేడ్స్ మ్యాన్‌కి 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైటులో నోటిఫికేషన్ అందుబాటులో ఉందన్నారు. అగ్నివీర్ ఎంపిక రెండు దశల్లో జరుగుతుందన్నారు.



ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గౌరవాధ్యక్షుడు మధు

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి

- తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మధు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆప్కాస్ పారిశుధ్య కార్మికులు 60 ఏళ్లు నిండితే వారి కుటుంబ పోషణకు అనుగుణంగా వారిస్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, శ్రామిక మహిళా ఫోరం జిల్లా కన్వీనర్ పి.లావణ్య, వి.కొండలరావు, అల్లం వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో సమూల మార్పులు

- సెకండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం
- ఈనెల 7 నుంచి ఫస్టియర్‌లోకి ప్రవేశాలు
- హాల్‌టికెట్ ఆధారంగా అడ్మిషన్లు
- సిలబస్ మార్పు

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

ఇంటర్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చింది. తరగతుల నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు నూతన సిలబస్‌ను అమల్లోకి తీసుకురానున్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారికి హాల్‌టిక్కెట్ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నారు. నూతన విధానంలో భాగంగా గత మంగళవారం నుంచే ఇంటర్ సెకండియర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ముందస్తు ప్రణాళికలతో ఈసారి సిలబస్ నడుస్తుండడం గమనార్హం. గతంలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసిన విద్యార్థులకు వేసవి సెలవులు అనంతరమే సెకండియర్ తరగతులను ప్రారంభించేవారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. జూన్‌లో ప్రారంభమయ్యే ఇంటర్ విద్యా సంవత్సరాన్ని ఇక నుంచి ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించేలా అకడమిక్ క్యాలండర్ రూపొందించి అమల్లోకి తెచ్చారు. తొలిరోజు కళాశాలల్లో హాజరు అంతంత మాత్రంగానే ఉన్నా బుధవారం నుంచి హాజరు శాతం పెంచేందుకు లెక్చరర్లు ప్రయత్నిస్తున్నారు. సిలబస్ ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ విద్యార్థిమిత్ర కిట్లు కింద పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేయనున్నారు. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఇచ్చి జూన్ 2న మళ్లీ తరగతులు ప్రారంభిస్తారు.

ప్రైవేటుకు దీటుగా అడ్మిషన్ల ప్రక్రియ

ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రైవేటుకు దీటుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదోతరగతి పరీక్షలు పూర్తి కావడంతోనే ప్రైవేటు కళాశాలలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఇదే విధానాన్ని ప్రభుత్వ అధీనంలోని కళాశాలల్లో పాటించాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించి అన్ని కళాశాలలకు ఆదేశాలు జారీచేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల హాల్‌టిక్కెట్ల ఆధారంగా ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. అడ్మిషన్ల ప్రక్రియను 7వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకుగాను టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని లెక్చరర్లు ప్రచారం నిర్వహించనున్నారు.

సిలబస్‌లో మార్పులు

ఇంటర్ విద్యా విధానంలో సమూల మార్పులు తెస్తున్న ప్రభుత్వం సిలబస్‌ను మార్చాలని నిర్ణయించింది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇందుకు నూతన పుస్తకాలు త్వరలోనే కళాశాలలకు చేరనున్నాయి. ఈ సిలబస్ వల్ల ఎంబైపీసీ కోర్సు కొత్తగా అందుబాటులోకి రానుంది. ఇదే సమయంలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించే 7 నుంచే బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తారు.

అకడమిక్ క్యాలెండర్ ఇలా..

ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించిన నేపథ్యంలో అకడమిక్ క్యాలెండర్‌ను ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 23 వరకూ ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించి 24 నుంచి జూన్ 1 వరకూ వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 2న ఇం టర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూలై 17నుంచి 19 వరకూ యూనిట్ 1 పరీక్షలు, ఆగస్టు 18 నుంచి 20 వరకూ యూనిట్-2 పరీక్షలు, సెప్టెంబరు 15నుంచి 20 వరకూ క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా సెలవులు ఉండనున్నాయి. అక్టోబరు 22 నుంచి 24 వరకూ యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకూ హాఫ్ ఇయర్లీ పరీక్షలు, డిసెంబరు 15 నుంచి 20వరకూ ప్రీఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 10నుంచి 18 వరకూ సంక్రాంతి సెలవులు ఇస్తారు. జనవరి 21నుంచి 28 వరకూ ప్రీఫైనల్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇదే నెలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి మొదటి లేదా రెండోవారంలోనే పరీక్షలు పూర్తి చేస్తారు. ఇంటర్ విద్యాసంవత్సరానికి 2026, మార్చి 18న ఆఖరి పనిదినంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇంటర్ విద్యా సంవత్సరంలో మార్పులకు అనుగుణంగా గతంలో 215గా ఉన్న పనిదినాలు 235 రోజులకు పెరగనున్నాయి.

కొంగలు... కాదండీ!



ఈ చెట్టును చూశారా.. చెట్టుకు కొంగలు కాసినట్టు ఉంది కదా!.. అటుగా వెళ్లే వాళ్లు ఆగి ఆశ్చర్యంగా చూస్తున్నారు. కానీ ఇవి కొంగలు కాదు. బూరుగ కాయలు. వేసవిలో ఆకులన్నీ రాలిపోవడంతో దూరం నుంచి ఈ బూరుగ కాయలు కొంగల్లా కనిపిస్తూ కళ్లకు పరీక్ష పెడుతున్నాయి మరి! తూర్పు గోదావరి జిల్లా కడియపులంక వద్ద జాతీయ రహదారి పక్కన ఈ చెట్టు కనువిందు చేస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



అదిరే ఎండ... బొమ్మలే అండ



ఎండలు మండుతున్నాయి... రోడ్లపై జన సంచారం తగ్గుతోంది... కాళ్లరిగేలా తిరిగినా కొనేవారే కరువయ్యారు... చేసేదేముంది... కాకినాడ శాంతినగర్‌లో అలసి సొలసిన ఓ విక్రయదారుడు ఆ బొమ్మల నీడనే కాస్త విశ్రాంతి తీసుకుంటూ ఇలా కనిపించాడు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నల్లమట్ట... చిక్కిందోచ్!

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి బుధవారం తెల్లవారు జామున సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రసాద్ వలకు అరుదైన నల్లమట్ట చేప చిక్కింది. సుమారు 20 కిలోల బరువున్న ఈ చేపకు మినీ హార్బర్ దగ్గర వేలంపాట నిర్వహించగా కాకినాడకు చెందిన టోకు వ్యాపారస్తుడు రూ.6వేలకు పాడుకున్నాడు. సముద్రంలో చాలా అరుదుగా దొరికే ఈ చేప రుచి అమోఘంగా ఉంటుందని మత్స్యకారులు చెప్తున్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



సత్యవాడ... నవమి శోభ



చెరువు వీధిలో సీతారాములు

- శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గ్రామం
- భద్రాచంలో మాదిరిగానే చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణం
- పూల కుండీలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మిక వాడగా పేర్గాంచింది సత్యవాడ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలోని ఈ గ్రామం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతిచోటా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో జరిగే విధంగానే ఇక్కడా సీతారాముల కల్యాణం జరుపుతారు. అక్కడ మాదిరిగానే ఆరు బయట చలువ పందిళ్లు వేసి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లోనూ ఆడపడుచులను, బంధువులను ఆహ్వానించి తమ ఇంట్లో పెళ్లి మాదిరిగా స్వామివారి కల్యాణం జరుపుతారు.

కె.గంగవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామంలోని చెరువు వీధి, పెద్ద వీధి, కొత్తపేట వీధుల్లో చలువ పందిళ్లలోను, రామయ్య వీధి, బీసీ, ఎస్సీ కాలనీలు, గ్రామ శివారు ఖండ్రిక, రాయిచెరువుల్లోని ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తిలకిస్తారు. తలంబ్రాలు సమయంలో వాటిని ఒడిసి పట్టి ఇళ్లకు తీసుకెళ్తారు. పిల్లలు లేనివారు వాటిని కొన్ని తలపై వేసుకుని, పూజా మందిరంలో పెట్టి పూజిస్తే సంతానం కలుగుతుందని నమ్ముతున్నారు. ఇలా కొంతమందికి జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. విద్యార్థులు కల్యాణంలో పాల్గొని స్వామిని పూజిస్తే మంచి విజయాలు సాధిస్తారని ఇక్కడి వారి నమ్మకం. ప్రస్తుతం చలువ పందిళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

ఇక్కడ చలువ పందిళ్లను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతి ఒక్కరూ రేయింబవళ్లూ కష్టపడతారు. మహా శివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయరీలో నిమగ్నమవుతారు. ఉగాది నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేప్, గున్న పేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయారు చేస్తారు. 50-60 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో సుమారు 50 కుండీలు, అంత కంటే ఎక్కువ అలంకరిస్తారు. ఇవి సహజమైన పూల మాదిరిగా చూపరులను ఆకట్టుకుంటాయి.



పూల కుండీ తయారు చేస్తున్న యువకుడు



తయారైన పూల కుండీలు



ఆకర్షణీయంగా కాగితం పువ్వు



కొత్తపేట వీధిలో కొలువైన సీతారాములు



నైట్‌క్వీన్ పూల కుండీ



సీతారాముల కల్యాణానికి నిర్మించిన చలువ పందిరి

సత్యవాడలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్తులంతా శ్రమదానం చేస్తారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పందిరి అలంకరణలో పాల్గొంటారు. చందాలు వేసుకుని, కావాల్సిన ముడిసరుకు కొనుగోలు చేసి పూల కుండీలు తయారు చేస్తారు. దీనికోసం కొంత సమయం కేటాయిస్తారు.

ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చకచకా జరుగుతు న్నాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో వీధుల్లో లైటింగ్ పెడుతున్నారు.



తెల్ల మందారం పూల కుండీ



పొద్దుతిరుగుడు పూల కుండీ







గులాబీ, కనకాంబరం, సంపెంగ పూల కుండీలు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న

దివాన్‌చెరువు యువకుడు

- బబ్లూ వేసిన వేంకటేశ్వరస్వామి చిత్రం



ఇండియన్ బుక్ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న బబ్లూ వేసిన చిత్రం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువుకు చెందిన యువకుడు బబ్లూ డాంగి బియ్యపు గింజలతో వేసిన తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కించుకుంది. ఈసందర్భంగా బబ్లూ ఆంధ్రజ్యోతితో బుధవారం ఫోన్‌లో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన తమ కుటుంబం దాదాపు 27 సంవత్సరాలుగా దివాన్‌చెరువులోనే నివాసం ఉంటోందన్నారు. తన తండ్రి దివాన్‌చెరువులో పానీపూరి అమ్ముతారని తాను ప్రస్తుతం ఢిల్లీలోని కళాశాలలో ఫైన్ ఆర్ట్స్ అభ్యసిస్తున్నానన్నారు. తనకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టమని, తమ తల్లిదండ్రుల సహకారం, మామయ్య ప్రోత్సాహంతో తాను ఆ రంగంవైపు దృష్టి సారించానన్నారు. తనచెల్లెలు ఇంటర్ రెండో సంవత్సరం అభ్యసిస్తున్నారని చెప్పారు. తాను బాస్మతి బియ్యం, ఎకరిలిక్ రంగులు, ఫెవికాల్ ఉపయోగించి రెండు అడుగుల వెంకటేశ్వరస్వామి చిత్రాన్ని వేశానని చెప్పారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈచిత్రం స్థానం దక్కించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇదేవిధంగా తాను గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో కూడా స్థానం దక్కించుకోవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని చెప్పారు.

6న ర్యాలి కేశవస్వామి కల్యాణం

- కేశవ దీక్షలు చేపట్టిన 300 మంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి వార్షిక కల్యాణోత్సవం ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నారు. 6న స్వామివారి కల్యాణం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించనున్నారు. మంగళవారం కల్యాణోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. అనంతరం తొలి ఆహ్వాన పత్రికను ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఎమ్మెల్యే సత్యానందరావుకు అందజేశారు. స్వామివారి ఆలయంలో సుమారు 300 మంది భక్తులు కేశవమాల దీక్షను ధరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు మాలధరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అవాంటెల్‌తో జేఎన్టీయూకే ఎంవోయూ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్‌లో కొలాబొరేటివ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో బుధవారం ఉదయం వీసీ సమావేశహాల్లో ఎంఓయూ కుదుర్చుకుంది. ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ యూసీఈకే ఒక ప్రముఖ విద్యా సంస్థగా పేరొందడంతోపాటు పూర్వ విద్యార్థులు భారతదేశం, విదేశాలలో చాలా కీలకమైన స్థానాలలో ఉన్నారన్నారు. ఈసీఈ విభాగంలో ఏర్పాటుకానున్న సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్ స్పెషలైజేషన్ కోర్సు విజయవంతమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ తమ కంపెనీ విశాఖపట్నం, హైదరాబాద్‌లలో మూడు దశాబ్దాలపాటూ భారత రక్షణసేవలు, అనుబంధ సంస్థలకు ప్రత్యేకమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ప్రతిఏటా 25మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, విద్యాసాగర్, శ్రీనివాసరావు ఎంవోయూపై సంతకాలు చేయగా వీసీ ప్రసాద్, అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాద రాజు, పద్మరాజు, శ్రీనివాసకుమార్, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్

ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, వాళ్ల తరఫున వాదించడానికి న్యాయవాది లేకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా నియమిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె కేంద్ర కారాగారాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. వసతి సదుపాయాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఖైదీల సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని పారా లీగల్ వలంటీర్లను ఆదేశించారు. అనాలోచిత పనులవల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చెడు స్నేహాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఖైదీలకు హితవు పలికారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనలకు

బహుమతుల ప్రదానం



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటిక కళాకారులకు బహుమతి అందిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ వేదికపై మూడు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన మూడు నాటికలకు బహుమతులను అందజేశారు. ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ వారి స్వేచ్ఛ నాటిక, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్‌వారి జనరల్ భోగీలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మైత్రి కళా నిలయం వారి బ్రహ్మస్వరూపం నాటికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. దీంతో శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కాటన్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ రచయిత తనికెళ్ళ భరణి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వీరరాఘవ రెడ్డి, పలివెల త్రిమూర్తులుతోపాటు సీఆర్సీ కార్యవర్గ సభ్యులు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఆయా నాటిక కళాకారులకు అందజేశారు.

అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు

చురుగ్గా ఏర్పాట్లు: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనను వేడుకగా నిర్వహించడానికి రాష్ట్ర సాంస్కృతికశాఖ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ సెంట్రల్ జైలు రోడ్డులో నిర్వహించే వేడుకల్లో భాగంగా 500 ప్రదర్శనలకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమన్వయాధికారిగా మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలను తిలకించాలని ఆమె కోరారు.



చిత్రకళాప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

స్నానానికి వెళ్లి...శాశ్వతంగా దూరమై!

- కాకినాడ జిల్లాలో విషాద ఘటనలు
- కాండ్రకోట ఏలేరు కాలువలో స్నానానికి దిగి ఇద్దరి మృతి
- పెద్దనాపల్లి ఏలేరు కాలువలో మరణించిన ఇద్దరు యువకులు
- శోకసంద్రంలో కుటుంబసభ్యులు


కాండ్రకోటలో మరణించిన కొప్పాడి బాలు, నాగవిశాల్ వర్మ (ఫైల్ ఫొటోలు)


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన యువకుడు, బాలుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. యానాంకు చెందిన కొప్పాడ సత్తిబాబు, తిరమూడి రాజు కుటుంబాలు ఈ నెల 1న నూకాలమ్మ దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సమీపంలోని ఓ తోటలో వంట వండుకుని కుటుంబ సమేతంగా అందరూ కలిసి భోజనాలు ముగించుకుని ఆనందంగా గడిపారు. ఇంతలో కొప్పాడ బాలు(20), తన మేనల్లుడు తిరుమాడి నాగవిశాల్ వర్మ (8) స్థానిక ఏలేరు కాలువలోకి స్నానానికి వెళ్లారు. సాయంత్రం అయిన వారు రాకపోవడంతో వారి కోసం ఎదురుచూసిన కుటుంబీకులు వారికి ఆచూకీ దొరకలేదు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయడంతో స్థానిక పోలీసులకు వారు సమాచారం అందించారు. చీకటి పడిపోవడంతో మర్నాడు ఉదయాన్నే ఎస్‌ఐ మౌనిక, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో ఏలేరు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈలోగా బాలుడు వర్మ మృతదేహం ఉదయం కనుగొన్నారు. బాలు మృతదేహం కోసం మరో 3 గంటలు వరకు పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఏలేరు కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడంతో సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. 2 మృతదేహాలను శవపంచనామా నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుకు తల్లితండ్రి తో పాటు చెల్లి హారిక ఉంది. ఆ కుటుంబాలు చిరు ఉద్యోగాలతో జీవనం సాగిస్తుండగా మృత్యువు కబళించడంతో ఆ కుటుంబ సభ్యులు పెట్టిన రోదన చూపరులను కంటతడి పెట్టించాయి. వర్మ నాల్గోతరగతి చదువుతూ మేనమామతో ఉంటున్నాడు. ఎనిమిదేళ్ల ప్రాయంలోనే మృత్యు వు కాటేయడంతో 2 కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.


పెద్దనాపల్లిలో మరణించిన జీవన్, తరుణ్


ఫైల్ ఫోటోలు

ఏలేశ్వరం/జగ్గంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఏలేరు నదిలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో జరిగింది. జగ్గంపేట గ్రామానికి చెందిన దేవర జీవన్‌కుమార్ (19), మెల్లి వీరవెంకట దుర్గ అలియాస్ తరుణ్(19)లు మిత్రులతో కలిసి బుధవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు కిర్లంపూడి- ఏలేశ్వరం సరిహద్దులో ఉన్న ఏలేరు కాలువలోకి దిగారు. అయితే జీవన్‌కుమార్, తరుణ్‌లు నీటిలో కొట్టుకుపోవడంతో తోటి స్నేహితులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటన ఏలేశ్వరం పరిధికి రావడంతో ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయన అక్కడ చేరుకున్నారు. జగ్గంపేటకు చెందిన మొత్తం ఏడుగురు యువకులు పెద్దనాపల్లి శివారులో ఏలేరు కాలువలో స్నానానికి వెళ్లగా ప్రమాదశాత్తు నీటిలో మునిగిపోవడంతో జీవన్‌కుమార్, తరుణ్ మృతి చెందినట్టు ఆయన తెలిపారు. వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. యువకుల మృతితో జగ్గంపేటలోని యాదవపేటలో విషాదచాయలు అలముకున్నాయి. జీవన్ ఇటీవల ఇంటర్ పరీక్షలు పూర్తి చేశాడు. అతడి తల్లిదండ్రులు దేవర వాసు, వరలక్ష్మి. తాపీ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న కొడుకు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. తరుణ్ తండ్రి రాంబాబు దేవుడి బొమ్మలు తయారు చేస్తుంటాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తండ్రితో పాటు కుటుంబసభ్యులు తీవ్ర వేదన చెందుతున్నారు.

గోదావరి డెల్టాకు 7 వరకు నీటి విడుదల

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు


డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్టు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే ద్వారా విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. డొంకరాయి జలాశయం ద్వారా ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదలచేయాలని తొలుత కోరారన్నారు. అయితే రబీ పంటలకు ఇంకా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 7 వరకు డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 10 నుంచి మా ర్చి 31 వరకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా 14.468టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో ఆంధ్రా వాటా 33.1849 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ (సీలేరు)జలశయాల్లో13.1061టీఎంసీలతో కలిసి మొత్తంగా సీలేరు కాంప్లెక్సుకు 46.2910 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు సీఐ వాసుదేవరావు తెలిపారు.

అన్ని కోణాల్లో నాగాంజలి కేసు దర్యాప్తు

కొంతమంది రాజకీయ లబ్ధికి ఈ సంఘటనను వాడుకోవడం సరికాదు : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మాలజిస్ట్‌గా పనిచేస్తున్న నల్లపు నాగాంజలి ఆత్మహత్య యత్నం సంఘటనకు సంబంధించి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. బుధవారం ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 24వ తేదీన ఆస్పత్రి డ్యూటీలో ఉన్న నాగాంజలి ఆత్మహత్య యత్నం చేసిందని ఆమె తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు చేయడంతో క్రైమ్ నెంబర్ 54/2025 యూ/ఎస్ 74,79, 351(2), 226 బీ ఎన్ ఎస్ (354, 909, 506, 309 ఐపీసీ) 75,78, 115(2), 64, 108, ఆర్/డబ్ల్యు 56 బీఎన్ఎస్ (354-ఏ, 354-డీ, 323, 376, 306 ఆర్/డబ్ల్యు 116 ఐపీసీ) గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ కేసులో నిందితుడు దువ్వాడ మాధవరావుదీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నాగాంజలి రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా ఈ కేసును రేప్ కేస్‌గా అల్టర్ చేసి సెక్షన్లు మార్పు చేసి ఆస్పత్రి సీసీ పుటేజ్ కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలానే దీపక్‌ను సమగ్ర విచారణ చేసేందుకు పోలీస్‌కస్టడీకి ఇవ్వమని కోర్టును కోరడం జరిగిందన్నారు. నాగాంజలి ఆరోగ్య విషయం పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ డాక్టర్ల కమిటీని నియమించారని, ఆ కమిటీ నాగాంజలి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు. ప్రస్తుతం నాగాంజలి వెంటిలేటర్ మీద ఉండటం, వెంటిలేటర్ తీసేసిన ఎడల ఆమె చనిపోవచ్చని వైద్యులు అప్రమత్తంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేసు దర్యాప్తులో నిష్పక్షపాతంగా ఎటువంటి అనుమానాలకు, అపోహలకు తావు లేకుండా పూర్తి పారదర్శంగా దర్యాప్తు జరుగుతోందన్నారు. అయితే ఈ కేసు విషయంలో కొంత మంది రాజకీయ లబ్ధి కోసం నాగాంజలి ఆత్మాహత్య ఘటనను వాడుకుంటున్నారని, సరైన పద్ధతి కాదని డీఎస్పీ తెలిపారు. ప్రకాష్‌నగర్ సీఐ బాచీలాల్, ఎస్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్‌లో నగదు కాజేసిన దొంగ అరెస్టు

రూ.2,64,000 స్వాధీనం

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దానవాయిపేట లక్ష్మి ఫెర్టిలిటీ సెంటర్‌లో గత నెల 28న రాత్రి ఓ దొంగ ప్రవేశించి నగదు అపహరించుకుపోయాడు. ఈ మేరకు ఆ సెంటర్ నిర్వాహకుడు గవర సాయిరామకృష్ణ గత నెల 29న స్థానిక 1 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన 1 టౌన్ సీఐ ఎన్.మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణ తమ సిబ్బందితో దొంగతనం కేసును ఛేదించారు. దొంగతనానికి పాల్పడింది స్థానిక వంకాయలవారి వీధికి చెందిన అక్కుబత్తుల గోవిందరాజు అలియాస్ గోవిందును బుధవారం అరెస్టు చేసి అతడి నుంచి రూ2,64,000 నగదు స్వాధీనపరుచుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోరుకు తరలించారు. దొంగను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ, ఎస్ఐ, హెచ్‌సీ సురేష్, కానిస్టేబుల్ గణేష్, వెంకటేష్‌ను ఎస్పీ నరసింహకిషోర్, డీఎస్పీ రమేష్‌బాబు అభినందించారు.

రేబీస్ సోకిన ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు గ్రామంలో వీధుల్లో తిరుగుతూ పలువురిపై దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఎద్దు బుధవారం మృతి చెందింది. వివరాల ప్రకారం.. సాధారణంగా దివాన్‌చెరువులో పశువులు యథేచ్ఛగా వీధుల్లో సంచరిస్తూ ఉంటాయి. మంగళవారం ఒక ఎద్దు వింతగా ప్రవరిస్తూ కొంతమందిపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి గ్రామంలో దీనిని ఒకచోట కట్టేశారు. బుధవారం ఈ ఎద్దుకు మత్తు మందు ఇచ్చి దానిని అక్కడి నుంచి తరలించేందుకు పంచాయతీ అధికారులు ప్రయత్నించారు. సీతానగరం నుంచి మత్తు వైద్యులను రప్పించామని దివాన్‌చెరువు పంచాయతీ పశుసంవర్ధక శాఖసహాయకుడు గణేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆ ఎద్దు మృతి చెందిందన్నారు. ఏదైనా పిచ్చి కుక్క కరిస్తే పశువులు మతిస్థిమితం తప్పుతాయని, ఆ తర్వాత 7 నుంచి 14 రోజుల్లో మృతి చెందుతాయన్నారు. ఈ ఎద్దు కూడా రేబీస్ వ్యాధి సోకి మృతి చెందిందని, దీని యజమానులు ఎవరో తెలియలేదన్నారు.

సారా కేసులో మహిళకు రూ.50వేలు జరిమానా

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన గుత్తుర్తి మునలమ్మను బుధవారం అరెస్టు చేశారు. ఆమెను పిఠాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రూ.50వేలు జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. మునలమ్మ నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

చందువ చేపల విత్తనోత్పత్తిపై సీఎంఎఫ్ఆర్ఐతో ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎంఎఫ్ఆర్ఐ సైంటిస్ట్‌లు, హేచరీ యాజమాన్యం

తొండంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చందువ చేపల విత్తనోత్పత్తిపై సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో కాకినాడ జిల్లా తొండంగిలోని దానవాయిపేట వైభవ్ హేచరీస్ వ్యాపార ఒప్పందం చేసుకున్నారు. బుధవారం దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ జోకే జోకేకిజ హకుడన్, వైభవ్ హేచరీ మేనేజింగ్ డైరెక్టర్ బేటే చంద్రశేఖర్ బేటే సాయి కపిల్ విఖ్యాత్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దేశంలోనే మొదటిసారిగా తీరప్రాంత గ్రామాల్లో చందువ చేపల విత్తనోత్పత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నట్టు కిజహకూడన్ తెలిపారు. రొయ్య ఉత్తత్తితోపాటు ఇతర చేపల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన సూచనల ఆధారంగా వాణిజ్య పరంగా చందువా చేపల ఉత్పత్తిని చేపట్టేందుకు సీఎంఎఫ్ఆర్ఐ కృషి చేసిందన్నారు. వైరస్ బ్యాక్టీరియాను తట్టుకునే విధంగా చందువా పిల్లల్ని ఉత్పత్తి చేసి పలు ప్రాంతాల్లో వీటి పెంపకంపై పరిశోధనలు చేయగా పూర్తిగా విజయవంతంపై ఆధారంగా తొండంగి మండలంలో వైభవ్ హేచరీతో ఎంవోయూ కుదుర్చుకుని రైతులకు సీడ్ అందుబాటులో ఉంచామన్నారు. రొయ్యల రైతులు కూడా వీటిని సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. డాక్టర్ బిజిజెవియర్, డాక్టర్ జయశ్రీలోక, డాక్టర్ రీతేష్ రంజన్ డాక్టర్ శేఖర్ మహర్జన్ బేటే సాయి త్రిలోక్, టీడీపీ జిల్లా మత్స్యకారఅధ్యక్షుడు కోడ వెంకటరమణ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో రీపోస్టుమార్టానికి ఎన్‌వోసీ ఇవ్వండి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎంపీ హర్ష తనయుడు శ్రీరాజ్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీరాజ్

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేకెత్తించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి ఘటనకు సంబంధించిన కేసులో పాస్టర్ పార్థివదేహానికి ఉస్మానియా వైద్యులతో ప్రైవేటు పోరెన్సిక్ ల్యాబరేటరీ పర్యవేక్షణలో రీపోస్టుమార్టం నిర్వహించేందుకు ఎన్‌వోసీ ఇవ్వాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీహర్షకుమార్ తరుపున ఆయన తనయుడు జీవీ శ్రీరాజ్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కేసుపై తెలుగువారిలో ఆసక్తి ఉందని, ఫెయిర్ అండ్ ట్రాన్సపరెంట్ ఇన్వెస్టిగేషన్ జరిగి నిజాన్ని నిగ్గు తేల్చకపోతే రానున్నకాలంలో ఇటువంటి బాధాకరమైన సంఘటనలు ఎన్నో జరుగుతాయని తెలిపారు. ఎన్‌వోసీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


మహిళ కాలు నుజ్జు నుజ్జు అయిన దృశ్యం

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల-పోతవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ క్రింద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు పట్టణం తంగెళ్ళమూడికి చెందిన బత్తుల రమణమ్మ కాలు లారీ చక్రాల క్రింద పడి నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ తమ కుమార్తె మహాలక్ష్మి స్కూటీపై తంగెళ్ళమూడి నుంచి పసివేదల వెళ్తుండగా నల్లజర్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి పోతవరం నుంచి నల్లజర్ల వైపుకు వచ్చే లారీ వేగంగా వచ్చి వారి స్కూటీని బలంగా ఢీకొంది. మహాలక్ష్మి రోడ్డు వైపుకు పడిపోగా రమణమ్మ ఎడమ కాలు లారీ చక్రల కిందకు పడింది. దీంతొ నుజ్జునుజ్జు అయింది. 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాంబాబు తెలిపారు.

మహిళ మాయలో పడిన సహకార ఉద్యోగి..

చికిత్స పొందుతూ మృతి

మహిళతో పాటు సహకరించిన ఇద్దరిపై హత్య కేసు నమోదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్న 60ఏళ్ల సత్తి వెంకటేశ్వరరావుకు ఓ మాయలేడి శారీరక వాంఛ ఎరవేసి మద్యంలో మత్తుబిల్లలు, గడ్డి మందు కలిపి తాగించిన ఘటనలో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. కాకినాడ మండల తూరంగి ప్రాంతానికి చెందిన కుమారి (30), ఆమెకు సహకరించిన బండారులంక ఎగ్జిబిషన్ వీధికి చెందిన పి.వెంకటరమణ, ఇందుపల్లికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యంపై తొలుత పట్టణ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సహకార ఉద్యోగి చికిత్స పొందుతూ మృతిచెందడంతో హత్య కేసుగా నమోదు చేసినట్టు తెలిపారు. సహకార ఉద్యోగి మృతదేహానికి గురువారం కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహిస్తారన్నారు. ఈ కేసులో నిందితులు ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ...


జారి పడి కార్మికుడు మృతి


మృతిచెందిన నాగబాబు

పెద్దాపురం, సామరకోట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్ నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారి పడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో ఉన్న రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్-2)లో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన రంగనాథం నాగబాబు (40) స్థానిక రిలయన్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పరిశ్రమలో ప్లాంట్ నిర్మాణ పనులు జరిగే సమయంలో అదుపుతప్పి పైనుంచి పడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. యాజమాన్యం స్థానిక ప్రభుతాసుపత్రికి తరలించింది. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పల్సర్ ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న వ్యక్తిని బొలేరా వ్యాన్ ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తునిలో జరిగింది. పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన చందక శివ(19) తునిలో ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థలో పనిచేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా బుధవారం ఎస్.అన్నవరం వైపు వెళ్తూ రోడ్డుపై ద్విచక్రవాహనంపై ఆగి ఉండగా అతివే గంగా వచ్చి వ్యాన్ ఢీకొందని స్థానికులు తెలిపారు. శివ అక్కడికక్కడే మృతిచెందగా సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ గీతా రామకృష్ణ తెలపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

'డైట్'ల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)ల్లో డిప్యూటేషన్ పద్ధతిలో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల నుంచి కోరుతున్నామన్నారు. అర్హత గల సంబంధిత సబ్జెక్టులలో 55శాతం మార్కులు, ఎంఈడీలో 55 శాతం మార్కులు కలిగి స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం కలిగి వారి వయసు 58 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు కాకినాడ డీఈవో కార్యాలయంలో సమర్పించాలని రాత పరీక్ష, ఇంట ర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను పూరిస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు https://forms.gle/4unKU4g6moktyp5Q6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్ కాపీ ని సంబంధిత అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత బీజేపీ ప్రజా ప్రతినిధులు తీసుకుంటారని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో కూటమి బలంగా ఉన్నా మండలిలో వైసీపీ మెజార్టీ వల్ల కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఐదుగురు సభ్యులు మండలిలో కూటమి ప్రభుత్వం తరపున చేరడంతో బలం పెరిగిందన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు త్రికరణ శుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కుళాయిలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి నీరిస్తూ పవన్ కల్యాణ్ పేదల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన బీజేపీ అధిష్టానం, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.

పంగిడిలో 'తిరుమల' నూతన శాఖ ప్రారంభం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుమలరావు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల విద్యాసంస్థల నూతన శాఖను కొవ్వూరు మండలం పంగిడిలో ప్రారంభించారు. బుధవారం నూతన శాఖలో చైర్మన్ నున్న తిరుమలరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిగా తిరుమల విద్యాసంస్థలను రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో స్థాపించామని.. అనంతరం విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట, తణుకులో ప్రారంభించడం జరిగిందన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో నూతన శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికి అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యాసంస్థలను స్థాపించామన్నారు. కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లులోని పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, శ్రేయోభిలాషుల కోరికమేరకు పంగిడి, కాపవరం జంక్షన్ వద్ద తిరుమల నూతన శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్.కె.జీ నుంచి పదో తరగతి, జూనియర్ ఇంటర్ డేస్కాలర్‌గా ప్రారంభించామన్నారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం, కొయ్యలగూడెం చుట్టుపక్కల గల అన్ని ప్రాంతాల నుంచి బస్సుసౌకర్యం కలదన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని తల్లితండ్రులు వినియోగించుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం 8096397777, 8096497777లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి కెఎస్ జవహర్, డా.సాంబశివరావు, తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, చాగల్లు, పంగిడి, కొవ్వూరు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, తిరుమల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేరాబత్తుల ప్రమాణ స్వీకారం



కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

హత్య కేసులో తండ్రీకొడుకుల అరెస్ట్

తప్పు ఒప్పుకున్న నిందితులు

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో గత నెల 31న సోమవారం రాత్రి పేరం శివ (27)ను కత్తులతో దారుణ హత్య చేసిన అతడి బావమరది రేగుల శ్రీరామ్, మామ వెంకన్నలను బుధవారం అరెస్ట్ చేసినట్టు సీఐ రాంబాబు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే తమ కుతూరుని శివ తిట్టడం, కొట్టడం జరుగుతుందని కోపంతో శివను హత్య చేసినట్టు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి


కలవచర్లలోని ఇండస్ట్రియల్ పార్కులో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

పరిశ్రమల స్థాపనతో

యువతకు ఉపాధి అవకాశాలు

● కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతో గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజానగరం మండలం కలవచర్లలోని ఇండస్ట్రియల్ పార్కును ఏపీఐఐసీ అధికారులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే బత్తుల సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఏపీలో అభివృద్ధి జరుగతోందన్నారు. రాష్ట్రంలో నూతన కంపెనీలు ఏర్పాటుచేయడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఆస్కారం ఉంటుందన్నారు. రాజానగరం జాతీయ రహదారికి కలిసే విధంగా పారిశ్రామికప్రాంతంలో ఉండే గండేపల్లి వరకు ప్రత్యేక రహదారిని అభివృద్ధి చేయనున్నామన్నారు. మే నెలాఖరు నాటికి పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ఇండస్ట్రియల్ పార్కును 360బ్లాకులుగా విభజించామని, సింగిల్‌విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారికి అనుమతులు లభిస్తాయన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు స్థానికంగా ఉండి, సొంత గ్రామాల్లోనే ఉద్యోగాలు చేసుకునేలా ఇండస్ట్రియల్ పార్కు ను అభివృద్ధి చేస్తామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే ఆహార, పండ్ల రకాలకు సంబంధించిన ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందన్నారు. ఏపీఐఐసీ ద్వారా రాజానగరంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏపీఐఐసీ అధికారులు ఎప్పటికప్పుడు ఈప్రాంత అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. త్వరలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామ న్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. జూన్ మొదటి వారంలోగానీ, రెండో వారంలోగానీ సైట్స్ ఎలాట్ చేస్తామన్నారు. 104 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ పార్క్‌లో 369 సైట్స్ ఉన్నాయని, 300 గజాల నుంచి ఎకరం వరకు సైట్స్ ఇచ్చేందుకు ఏపీ ఐఐసీ సిద్ధం చేస్తుందన్నారు. మినిమం రూ.5లక్షలు నుంచి రూ.25 కోట్లు పెట్టుబడి పెట్టేలా ఇన్ఫ్రాస్ట్రక్చర్ నెలకొల్పుతామన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన అన్నిరకాలైన అనుమతులు సింగిల్ విండో ద్వారా పొందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సబ్సిడీ విషయానికి వచ్చే జనరల్ కేట గిరి 25శాతం కాగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వారికి 45 శాతం వరకు సబ్సిడీ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. త్వరలో రాజానగరం నియోజకవర్గంలో 25 ఎకరాల్లో సాఫ్ట్‌వేర్ పార్కును ఏర్పాటుచేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకు మంత్రి లోకేష్ సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సాయి సతీష్, ఏఈ కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బి.శ్రీనివాస్, ఏఈ అవినాష్, ఏపీఈపీడీసీఎల్ డీఈ పి.సన్యాసిరావు, ఏఈ వి.సుధాకర్ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నిరసన ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, పెండింగ్ బకాయిలు తదితర సమస్యల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ధర్నా నిర్వహించింది. ఫ్యాప్టో నాయకత్వం పిలుపు మేరకు బుధవా రం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసనలో ఫ్యాప్టో చైర్‌పర్సన్ డేనియల్ బాబు, సెక్రటరీ జనరల్ పి.జయకర్, రాష్ట్ర కోశాధికారి నరహరి, కో చైర్మన్ శేషబ్రహ్మం, ఇతర కార్యవర్గ సభ్యులు వి.రవికుమార్, కె.లివింగ్‌స్టన్, పి.సువర్ణరాజు మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నెం.57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని, 12వ పీఆర్‌సీకి కమిషన్‌ను నియమించాలని ఈలోగా 30శాతం మధ్యంతర భృతిని ఇచ్చి 3 కొత్తపెండింగ్ డీఏలను విడుదల చేయాలనే 7 ప్రధాన డిమాండ్లను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని వారు కోరారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వింత నిర్ణయాలు, నిబంధనలతో అర్హులైన పేదలు అనేక మందికి రేషన్‌కార్డులు లేకుండా పోయాయని దీనివలన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారు దూరం అయ్యారని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన లోటుపాట్లు వెలికితీసి అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రేషన్‌కార్డులు ఏటీఎం కార్డు సైజుల్లో రాబోతున్నాయన్నారు. స్మార్ట్‌కార్డుల రూపంలో కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఈనెల 30తో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టిందని తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి

● పారిశుధ్య వాహనాలు, బాబ్ క్యాట్ మిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల


బాబ్‌క్యాట్ మిషన్ ఎక్కి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌స్ఫూర్తితో స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యంతోపాటు సిమెంటు రోడ్లు, డ్రైన్‌లు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పన జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. దీనిలో భాగంగా గెయిల్ సంస్థ అందజేసిన సీఎస్ఆర్ నిధులు రూ.55లక్షలతోపాటు పంచాయతీల నుంచి సేకరించిన మరో రూ.5.80లక్షలతో కొన్న మూడు మహేంద్ర ట్రక్కులు, మల్టీ పర్పస్ బాబ్‌కాట్ మిషన్‌ను గోరంట్ల ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ రూరల్ మండల గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపరిచేందుకు మరిన్ని వాహనాలు, యంత్రాలు అవసరమని పంచాయతీలకు వాటిని సమకూర్చడానికి ఓఎన్జీసీ, పేపర్‌మిల్లు సంస్థల నుంచి సహకారం కోరామన్నారు. గోదావరి వరదల సమయంలో ఆవ ఛానల్ ద్వారా దిగువ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా కాల్వలోని నీటిని తోడిపోయడానికి రూ.4.5కోట్లతో సాయిబాబు గుడివద్ద పంపుహౌస్ నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే గోదావరి కాలుష్య నివారణ పథకంలో భాగంగా నిధులు తీసుకువచ్చి రాజమహేంద్రవరం నుంచి వచ్చే మురుగునీరు శుద్ధి చేసి కాటన్‌బ్యారేజ్ దిగువ నుంచి సముద్రంలోకి పోయే విధంగా చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని అందిస్తామని తెలిపారు. అనంతరం 3 మహింద్ర ట్రక్కులను ధవళేశ్వరం, రాజవోలు, కాతేరు గ్రామ పంచాయతీలకు అందజేశారు. బాబ్‌కాట్ మిషన్‌ను ఎక్కిదాన్ని ఆపరేట్‌చేసి సంస్థ అధికారుల నుంచి మిషన్ పనితీరు అడిగి తెలుసుకున్నారు. నిధులు అందజేసిన గెయిల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో డీజీపీవో వి.శాంతమణి, ఈవోపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్,ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, గెయిల్ అధికారులుకేవీఎస్ రావు, వైకే కుమార్, డి.ప్రభాకర్, బాబ్‌కార్ట్ మిషన్ బిజినెస్ హెడ్ వెంకట్‌కుమార్ నాయుడు, టీడీపీ నాయకులు మచ్చేటిప్రసాద్, పండూరి అప్పారావు, పిన్నంటి ఏకబాబు, యర్రమోతు ధర్మరాజు, తలారి మూర్తి, బత్తిన బ్రదర్స్ శ్రీనివాసరెడ్డి, రమేష్, కొడమంచలి సూర్య, బీజేపీ నాయకులు ఒంటెద్దు స్వామి, డాక్టర్ జి.కొండలరావు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శివాలయంవరకు నిర్మించిన సీసీరోడ్డును టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

బిక్కవోలు మాజీ ఎంపీపీ జ్యోతిర్మయి ఎంపీటీసీ పదవికి రాజీనామా

బిక్కవోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ ఎంపీపీగా గతంలో వైసీపీ నుంచి గెలుపొందిన కొవ్వూరి జ్యోతిర్మయి కూటమి ప్రభుత్వం రాగానే తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. అయితే బుధవారం కొమరిపాలెం-2 నుంచి గెలుపొందిన ఎంపీటీసీ పదవి కూడా రాజీనామా చేసి కాకినాడజిల్లా పరిషత్ సీఈవోకు లేఖను అందజేశారని తెలిసింది. బిక్కవోలు ఎంపీడీవో వి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తనకు సమాచారం లేదన్నారు.

గురుకుల విద్యాలయాల్లో స్థిరమైన టైం టేబుల్ అమలుచేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాలయాల్లో కిందిస్థాయి అధికారులు ప్రతిఏటా టైంటేబుల్ మార్చడంవల్ల స్టాండర్డు ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) కార్యక్రమాలు అమల్లో చురుకుదనం లోపిస్తున్నదని, ఈ పరిస్థితుల్లో ఒక స్థిరమైన టైం టేబుల్ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మీనారాయణ, పి.చిన్నయ్య కోరారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యావిధానంలో మార్పులు తేవడానికి జీవో ఎంఎస్ నెం.46 విడుదల చేసిందని, దీని ప్రకారం ఉదయం 7.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ టైం టేబుల్ ఇచ్చారని తెలిపారు. ఈ టైంటేబుల్ ప్రతిఏటా మార్చడంవల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నందున ఈ టైం టేబుల్‌ను ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4.15 వరకూ అమలుచేయాలని కోరుతున్నామని వారు పేర్కొన్నారు.

డీసీసీబీ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణమూర్తి మృతి

● మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల సంతాపం




గట్టి భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

కడియం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, పలు పదవులు చేపట్టిన గట్టి సత్యనారాయణ మూర్తి (90) బుధవారం వృద్ధాప్యంతో మృతి చెందారు. గట్టి సత్యనారాయణమూర్తి సర్పంచ్‌గా, డీసీసీబీ డైరెక్టర్‌గా, కడియం నియోజకవర్గంగా ఉన్న సమయంలో సుదీర్ఘకాలంపాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, నీటిసంఘం అధ్యక్షుడిగా పదవులు చేపట్టారు. మాజీ ఎంపీ ఉండవిల్లి అరుణకుమార్, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావులతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భారీగా నిధులు సేకరించి కడియం మండల అభివృద్ధిలో ఆయన భాగస్వాములు అయ్యారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ ఎంపీపీ మార్గాని లక్ష్మీసత్యనారాయణ, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల స్టాలిన్, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, టీడీపీ, జనసేన, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, బొర్సు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు, నర్సరీ రైతులు సత్యనారాయణమూర్తి మృతికి సంతాపం ప్రకటించారు.

వసంత నవరాత్రి వేడుకలు



బిక్కవోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతలమామిడి వద్ద జరుగుతున్న వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి, భూదేవి, పద్మావతులు లక్ష్మీపార్వతి, సరస్వతి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రమణశర్మ, పంతులు మాష్టారు అమ్మవార్లను అద్భుతంగా అలంకరించారు. మల్లిడి కోదండం బ్రదర్స్ భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

'ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న లింగమల్లు శ్రీనివాసరావు

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఆ మాటను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లింగమల్లు శ్రీనివాసరావు, బొజ్జా రామకృష్ణలు కోరారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధ వారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి నాయకులు 2019 అంతకు ముందు టీడీపీ హయాంలో భవననిర్మాణ కార్మిక బోర్డు పూర్తిగా అమలుచేయకుండా పాక్షికంగా మాత్రమే చేశారని అన్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వంపై ఆశతో ఉన్న తమకు నిరాశే మిగులుతోందన్నారు. ఇప్పటికైనా తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు తారకనాథ్, జాయింట్ శక్రటరీలు మంత్రిప్రగడ శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, పతివాడ రవి, ఉప్పు సత్యనారాయణ, కాకి రవిబాబు పాల్గొన్నారు.

ఆటిజం చిన్నారుల్లో మార్పు తేవడానికే భవిత కేంద్రాలు

● ఎంఈవో సత్యనారాయణ

బిక్కవోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వయసుకు తగ్గట్లుగా మానసిక పరమైన ఎదుగుదలలేని ఆటిజం చిన్నారుల్లో మార్పు తేడానికే భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బిక్కవోలు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఘనంగా ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. తమ దగ్గరకు వచ్చిన ఆటిజం చిన్నారులకు శిక్షణ ఇవ్వడంతో చక్కగా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారని ఐఈఆర్‌పీ సన్యాసిరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ శ్రీనివాసరావు, సీఆర్‌పీ మాధవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలకు సత్వర పరిష్కారం

● తోకాడ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో రీసర్వే పేరుతో తలెత్తిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో తోకాడలో బుధవారం తలపెట్టిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో రీసర్వే పేరు చెప్పి అనేక భూకబ్జాలు, అంతులేని అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటన్నింటికీ విముక్తి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. రైతుల భూములు విషయంలో ఎటువంటి లోపాలు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, నాయకులు నరసయ్య, రైతులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

సీతానగరం: ప్రభుత్వం రైతులకోసం నిర్వహిస్తున్న భూ రిసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బుధవారం మునికూడలిలో పంచాయతీ కార్యాలయంవద్ద భూ రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరు మార్పులు, విస్తీర్ణం తదితర అంశాలకు సంబంధించి, భూముల రి సర్వే తదితర అంశాలలో సమస్యలను పరిష్కరించడానికి ఈ గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు దీనిని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో మార్పులు చేర్పులకు సులభతరంగా పూర్తయ్యేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమవద్ద ఉన్న రికార్డులు అందించాలన్నారు. మండల సర్వేయర్ గౌతమ్, వీఆర్వో కుమారి రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కొంతమూరు షణ్ముఖపీఠంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ ం మంగళవారం వైభవంగా జరిగింది. ఇక్కడ స్వామివారి సన్నిధిలో వడి పట్టుకొని, ఆ బియ్యంతో పర్వాన్నం ప్రసాదంగా స్వీకరించిన వారికి స్వామివారి అనుగ్రహంతో చక్కటి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా స్కందస్వామి మాట్లాడుతూ ప్రతీనెలా కృత్తికా నక్షత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికల్యాణం నిర్వహిస్తున్నామని,భక్తులుస్వామివారిని దర్శించుకుని అనుగ్రహం పొందాలని కోరారు.

'అంకితభావమే ఉపాధ్యాయుడికి ఆభరణం'

రంగంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అంకితభావమే ఉపాధ్యాయుడికి ఆభరణమని దీనివల్ల సమాజంలో నిత్య ఆదరణ లభిస్తుందని రంగంపేట మండలం మర్రిపూడి శ్రీపుట్ట శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మాచిన సాయిబాబు పదవీ విరమణ సభకు ఆయన అధ్యక్షత వహించి కీలక ఉపన్యాసం చేశారు. సాయిబాబు లాంటి ఉపాధ్యాయులవల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయని పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. సన్మాన గ్రహీత సాయిబాబు మాట్లాడుతూ తాను మర్రిపూడి పాఠశాలకు రుణపడి ఉన్నానని ఇందుకు గుర్తుగా పాఠశాలకు సౌండ్ సిస్టం, బీరువాను అందజేస్తున్నాని అన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు సాయిబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పిల్లి అన్నవరం పాల్గొన్నారు.

'అంకిత భావంతో పనిచేస్తేనే ప్రజామన్ననలు'

గోకవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే ప్రజా మన్ననలు పొందగ ల్గుతామని పలువురు వక్తలు అన్నారు. మండల పంచా యతీ విస్తరణ అధికారి(ఈవోపీఆర్‌డీ)గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎం.రాజేశ్వరావును బుధవారం పలువురు ప్రజాప్రతినిధులతోపాటు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో గోవిందు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో నిబద్ధతకు మారుపేరు రాజేశ్వరరావేనన్నారు. అనంతరం ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు.

హెచ్ఎంపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సీతానగరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల యూటీఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. బుధవారం పాఠశాల సమయం అనంతరం ఉపాధ్యాయులు నాగరత్నంకాలనీ పాఠశాలకు చేరుకుని దాడిని ఖండి స్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శ్రీమణి మాట్లాడుతూ విద్యార్థులు చేస్తున్న అల్లర్లను తప్పులను తల్లిదండ్రులకు తెలియజేయడం ఉపాధ్యాయుల బాధ్యతని, అలా తెలియజేడాన్ని తప్పుగా భావించి టీచర్‌పై దాడిచేయడం అమానుషమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతానగరం ఎంపీడీవో భారతికి వినతిపత్రం సమర్పించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.పాపారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరంకల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరనగర్ పార్కులో జవహర్ వాకర్స్‌క్లబ్ వారిచే ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, కెఎస్ఎల్ హాస్పిటల్ అధినేత కీర్తి సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు వాసు, రాఘవరెడ్డి, క్లబ్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు, క్లబ్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సుఖ ప్రసవాలపై అవగాహన పెంచుకోవాలి

అనపర్తి, ఏప్రియల్ 2 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రసవాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించు కోవాలని సిజేరియన్ జోలికి పోకుండా సుఖప్రసవాలపై దృష్టి సారించాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ అన్నారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిఒక్కరూ సిజేరియన్ వైపు మొగ్గు చూపుతున్నారని అత్యవసర పరిస్థితిలో మాత్రమే సిజేరియన్ చేయాలని అన్నారు. ముందుగా సుఖ ప్రసవంపై గర్భిణులను సిద్ధం చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. వైద్యులు తాడి రామగుర్రెడ్డి, వరలక్ష్మి, ప్రమీల, తరుణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే నల్లమిల్లి


ఎమ్మెల్సీ నాగబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలోని శాసనమండలి చైర్మన్ చాంబర్‌లో బుధవారం జరిగిన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారోత్సవంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. నూతన ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసిన ఐదుగురు సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ను మర్యాద పూర్వకంగా కలుసుకుని బొకే అందించారు. అనంతరం నూతన సభ్యుల ప్రమాణ స్వీకారమహోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీలుగా ప్రమాణంచేసిన కొణిదల నాగబాబు, పేరాబత్తుల రాజశేఖరం, బీటీ నాయుడు, సోము వీర్రాజులకు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టండి

● జేసీకి ఏపీఎంసీఈ సభ్యుడి వినతి


జేసీ చినరాముడికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వైద్యఆరోగ్యశాఖ జిల్లా అల్లోపతి, ప్రైవేటు మెడికల్ కేర్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావులు కోరారు. బుధవారం వారు జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడుని కలిసి వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల నుంచి విపరీతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, స్కానింగ్, ఎక్స్‌రే, టెస్ట్‌ల పేరుతో ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని దీనిపై కూటమి ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరారు. ఆస్పత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలు ఉన్నప్పటికీ రకరకాల సాకులు చూపి ఆ స్కీంలను ప్రక్కనపెట్టి నచ్చినరీతిలో వైద్యం అందించి అధిక ఫీజులు దండుకుంటున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీ స్పందించి పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఆదేశాలిచ్చారు.

పెద్దలను గౌరవించలేని విద్య వ్యర్థం

● నన్నయ ఉపకులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, పెద్దలను గౌరవించకుండా ఎంత ఉన్నత చదువులు చదివినా వ్యర్థమేనని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల, వివిధ విభాగాలను, తరగతి గదులను బుధవారం పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల హాజరు వివరాలను తెల్సుకున్నారు. సోషల్ మీడియా ప్రభావంతో తల్లిదండ్రులు, గురువుల మీద జోక్స్ వేయడం, వారి మాటను లెక్క చేయకుండా ప్రవర్తించడం నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు తగదన్నారు. పిల్లల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమించే తల్లిదండ్రులను ప్రేమించాలన్నారు. విశ్వవిద్యాలయంలో సీనియర్, జూనియర్ అనే భావనతో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వికసిత్ ఎట్‌దిరేట్ 2047 భారత్ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జీజీయు చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ ఎట్‌దిరేట్ 2047 కోసం అకడమిక్ రీసెర్చ్ అనే హ్యాండ్ బుక్‌ను గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ జీజీయులో బుధవా రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా చైతన్యరాజు మా ట్లాడుతూ పరిశోధన అనేది ఆవిష్కరణకు మూలాధారమని, భారతదేశ అభివృద్ధి లక్ష్యాలను అనుసరించే పరిశోధన ఆధారిత విద్యా వాతావరణాన్ని అభివృద్ధి చేయడమే జీజీయు లక్ష్యమన్నారు. జీజీయు ఉపకుల పతి యు.చంద్రశేఖర్, ప్రొవైస్ చాన్సలర్ కేవీబీ రాజు, బీవోజీ సలహాదారు వర్మ, డీన్ బి.ప్రభాకరరావు, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శర్మ, డీన్లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పోక్సోపై అవగాహన పెంపొందించుకోవాలి

● అనపర్తి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ

అనపర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిలు, బాలికలు పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్యంగా వారికి ఈ చట్టంపై అవగాహన కల్పించే దిశగా న్యాయవాదులు కృషిచేయాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ అన్నారు. బుధవారం అనపర్తిలోని సాయి మాధవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలు, మహిళలకోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఆపద సమయంలో వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రవి షణ్ముఖరెడ్డి, ఎస్ఐ శ్రీను నాయక్, ఎమ్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ అనంతరెడ్డి పాల్గొన్నారు.


అనపర్తిలో పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి వంశీ కృష్ణ





పాస్‌పోర్టులకు పోలీస్ క్లియరెన్స్ కష్టాలు!

- గడువు తీరిన డిజిటల్ కీ
- ఎస్పీ ఆఫీస్‌లో దరఖాస్తుల పెండింగ్
- అత్యవసర జారీలోనూ జాప్యం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒకరి నిర్లిప్తత.. మరొకరిని ఆందోళనకు గురిచేయడం అంటే ఇదేనేమో!. జిల్లా పోలీసు కార్యాలయంలోని పాస్‌పోర్టు సెల్‌లో డిజిటల్ కీ గడువు ముగియడంతో పోలీస్ క్లియరెన్స్‌లు ఆగిపోయాయి. దీంతో అత్యవసర విధానంలో పాస్‌పోర్టు జారీకోసం సాధారణం కంటే ఎక్కువ ఫీజు చెల్లించి తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సైతం నిరీక్షించక తప్పడం లేదు. జిల్లాలోని ఎవరు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా పోలీసుల నిరభ్యంతరపత్రం కోసం ఎస్పీ కార్యాలయానికి పాస్‌పోర్టు అధికారులు పంపిస్తారు. అక్కడి నుంచి సంబంధిత పోలీస్ స్టేషనుకు సమాచారం వెళుతుంది. వాళ్లు దరఖాస్తుదారు ఇంటికి వెళ్లి ఆయన పాస్‌పోర్టు కార్యాలయానికి సమర్పించిన పత్రాలను భౌతికంగా పరిశీలిస్తారు. అడ్రసు, దరఖాస్తుదారుడిని భౌతికంగా నిర్ధారించుకుంటారు. అభ్యర్థితో సంబంధిత పత్రాలపై సంతకాలు తీసుకుంటారు. ఎలాంటి ఇబ్బందీ లేకపోయినా ఒకవేళ ఉన్నా ఆ సమాచారాన్ని ఎస్పీ కార్యాలయానికి పంపిస్తారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఎస్పీ కార్యాలయంలో మళ్లీ ఆ పత్రాలను ఒకసారి పరిశీలించి పోలీసుల అంగీకారం/తిరస్కరణ సమాచారాన్ని పాస్‌పోర్టు కార్యాలయానికి తెలియజేస్తారు. పోలీసులు అంగీకరిస్తేనే పాస్‌పోర్టు జారీ అవుతుంది. పోలీసుల అభిప్రాయాన్ని పాస్‌పోర్టు కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపించడానికి ఎస్పీ డిజిటల్ సిగ్నేచర్‌తో కూడిన ఒక తాళం (డిజిటల్ కీ) ఉంటుంది. అది కంప్యూటర్‌కి అనుసంధానిస్తే గానీ ప్రక్రియ పూర్తి కాదు. ఈ ప్రక్రియను జిల్లా పోలీసు కార్యాలయంలోని పాస్‌పోర్టు సెల్ చూసుకుంటుంది. ఇప్పుడు పోలీస్ క్లియరెన్స్‌లో సరిగ్గా చివరి అంకమైన డిజిటల్ కీ దగ్గర ఇబ్బంది వచ్చింది. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల అభ్యర్థుల పాస్‌పోర్టు దరఖాస్తులకు సంబంధించి పోలీస్ క్లియరెన్స్ వెళ్లకపోవడంతో పాస్‌పోర్టుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా పోలీసు కార్యాలయంలోని డిజిటల్ కీని ప్రతి ఏడాదీ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగియడానికి ముందుగానే ఢిల్లీలోని కేంద్ర హోంమంత్రిత్వశాఖకు దరఖాస్తు పంపిస్తే.. అక్కడి నుంచి విశాఖపట్నంలోని రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయానికి కీ జారీకి అనుమతి వెళుతుంది. అప్పుడు ఎస్పీ అనుమతి పత్రంతో ఇక్కడి నుంచి పోలీస్ వెళ్లి డిజిటల్ కీని తీసుకురావాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి 28తో డిజిటల్ కీ గడువు ముగిసింది. అయితే ఫిబ్రవరిలోనే రెన్యూవల్‌కి దరఖాస్తు చేసినట్టు చెబుతున్నారు. కానీ చొరవ కరువు కావడంతో ఇప్పటికీ రెన్యూవల్ కాలేదు. దీంతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ విషయం తెలియకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఏ కారణంతో ఆగిపోయిందో అనే అయోమయం నెలకొంది. కొందరు అత్యవసరంగా విదేశాలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉంటాయి. విద్యార్థులు, మెడికల్ ఎమర్జెన్సీల విషయంలో ఈ అవసరత ఎక్కువగా ఉంటుంది. పాస్‌పోర్టులు జారీ ఆలస్యం కావడంతో అత్యవసరంగా వెళ్లడం కోసం తత్కాల్ విధానంలో పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు మరీ ఆందోళన చెందుతున్నారు. వాళ్లకు ఆలస్యంపై కనీసం సమాచారం కూడా లేదు. రాజానగరం పోలీస్ స్టేషను పరిధిలో నివాసం ఉంటున్న ఓ విద్యార్థిని గత నెలలో తత్కాల్ విధానంలో పాస్‌పోర్టు దరఖాస్తు చేసుకున్నారు. అదే నెల 27న రాజానగరం పోలీసులు నివేదికను ఎస్పీ కార్యాలయానికి పంపించినట్టు పాస్‌పోర్టు సేవా పోర్టల్ చూపెడుతోంది. ఆరు రోజులు గడిచినా ఇంకా పోలీసుల నిరభ్యంతర ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఆమె తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇలాగే పలువురు అభ్యర్థుల పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా దృష్టి సారించి సమస్యను తక్షణమే పరిష్కరించడానికి చొరవ చూపాలని వారు కోరుతున్నారు.


బొమ్మూరులోని టిడ్కో గృహ సముదాయం

ఎన్నాళ్లీ.. నిరీక్షణ!

- చంద్రబాబు కలల ప్రాజెక్టు టిడ్కో
- ప్రభుత్వమొస్తే కష్టాలు తీర్చేస్తామని ఎన్నికల హామీ
- వచ్చి పది నెలలు దాటినా అడుగు ముందుకు పడని వైనం
- జూన్ 12 నాటికి ఇళ్లు అప్పగించాలని తాజా లక్ష్యం
- మౌలిక సదుపాయాలు లేకుండా ఎలా ఉండేదని లబ్ధిదారుల ప్రశ్న
- ఉన్న ఫ్లాట్లూ అస్తవ్యస్తం.. తాగునీరే లేని దుస్థితి
- నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి టిడ్కో సమావేశం

పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం పెద్దఎత్తున జరిగింది. అపార్టుమెంటు తరహాలో చేసిన ఈ ఇళ్ల కోసం లబ్ధిదారులు పోటీపడ్డారు. సర్వహంగులతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలుగా నిర్మించిన ఈ భవనాలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. దశల వారీగా చేపట్టిన ఈ ఫ్లాట్ల నిర్మాణం తొలి దశ పూర్తికావడంతో లబ్ధిదారులకు అందించారు. మలి దశ ఫ్లాట్ల నిర్మాణమూ పూర్తయింది. కానీ ఈలోపు ఎన్నికలు రావడంతో గృహ ప్రవేశాలు చేసుకుందామని సిద్ధమైన వారికి ఆ అవకాశం చిక్కలేదు. ఎన్నికలయ్యాక వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీలను గాలికి వదిలేసింది. లబ్ధిదారులు ఎన్నిసార్లు ప్రాధేయపడినా ఏదొక నెపంతో ఐదేళ్లు కాలం గడిపేసింది. మౌలిక సదుపాయాలనూ పట్టించుకోలేదు. తమ పార్టీ రంగులు వేసి మమ అనిపించింది. దీంతో మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే తమ ఇళ్లకు మోక్షం కలుగుతుందని లబ్ధిదారులంతా ఎదురు చూశారు. అనుకున్నట్టుగానే చంద్రబాబు సీఎం అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు కావొస్తోంది. ఇప్పటికీ వీరి కష్టాలు తీరలేదు. చంద్రబాబు రాగానే ఈ కాలనీల తీరే మారిపోతుందని కలలు గన్న వారి ఆశలు తీరనేలేదు. ఇప్పటికైనా కాస్త మా కాలనీల వైపు చూడండయ్యా అంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యేలను, అధికారులనూ వేడుకొంటున్నారు. నిజానికి జూన్ 12 నాటికి టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో చొరవ లేదు. పైగా మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎలా ఉంటామని లబ్ధిదారుల ప్రశ్న. ఈ నేపథ్యంలో ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో టిడ్కో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం జరగనుంది. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించే అవకాశం ఉంది.



బొమ్మూరులో బాగు ఏదీ..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో 2014-19 మధ్య పేదవాని సొంతింటి కలను నిజంచేస్తూ బొమ్మూరులో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలను చేపట్టి 99 శాతం పూర్తి చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ గృహాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించలేకపోయింది. దాంతో ఐదేళ్ల పాటు 6,304 మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల కోసం ఎదురుచూశారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వరకైనా తమ ఇళ్లను అప్పగించాలని వేడుకుంటూనే ఉన్నారు. చివర్లో మాత్రం వైసీపీ రంగులు ఆ భవనాలకు వేసి హడావుడి చేసింది. కానీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఈలోపు ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయ్యారు. తమ కష్టాలు తొలగినట్టేనని లబ్ధిదారులు సంతోషపడ్డారు. కానీ అధికారంలోకి పది నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అప్పగించలేదు. మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం బొమ్మూరులో ఉన్న టిడ్కో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకుల కనెక్టింగ్ చేయాల్సి ఉంది. అలానే తొర్రేడులో ఉన్న టిడ్కో గృహాల వద్ద రహదారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది.

పరిశీలన

అసౌకర్యాల చెరలో బోడసకుర్రు గృహాలు

తాగునీరు.. డ్రైనేజీ సమస్యలు



(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహ సముదాయాలు నేడు అసౌకర్యాల చెరలో చిక్కుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలకు రంగులు అయితే మార్చిందిగానీ నివాస గృహాల యజమానులకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఆయా టిడ్కో గృహాల్లో నివశిస్తున్న నివాసితులు నిరంతరం కష్టాలతోనే జీవనం గడుపుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురంలో 2017లో టిడ్కో గృహాల సముదాయానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణంలో జాప్యం వల్ల లబ్ధిదారులు ఎంపికైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకైతే అందించారుగానీ అక్కడ కనీస సౌకర్యాల కల్పన చేపట్టలేదు. అమలాపురం పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లవరం మండలం బోడసకుర్రు శివారు దేవర్లంక బ్లోఅవుట్ సైట్ సమీపాన 2017లో 1632 టిడ్కో గృహాలను నిర్మించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకు 1576 గృహాలను అందించారు. వాటిలో ఇంకా 56 గృహాలను అర్హులకు అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 550 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటుండగా వెయ్యికి పైగా గృహాలు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఇక సెకండ్ ఫేజ్‌లో 962 ఇళ్లు నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రతిపాదనను ప్రభుత్వం దాదాపు విరమించుకున్నట్టే. ఇక్కడ మంచినీటి సమస్యతో డ్రైనేజీ సమస్య ఉంది. తాగునీరు లేకపోవడంతో అక్కడ నివాసం ఉండేందుకు ఎవరూ వెళ్లడం లేదు. పదిరోజులకోసారి బోడసకుర్రు టిడ్కో గృహాలకు మున్సిపల్ వాటరు ట్యాంకరు ద్వారా నీళ్లు పంపిస్తున్నారు. జనసేన నుంచి ఒక ట్యాంకరు ద్వారా నీళ్లు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి టిడ్కో గృహాల వద్దే రేషన్‌ను తీసుకునే సదుపాయం కల్పించినా పెన్షన్లు మాత్రం అమలాపురం పట్టణంలో వారి వారి వార్డులకు వెళ్లి 1వ తేదీన తీసుకోవాల్సిందే.



కాకినాడలోనూ అంతే..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేటలో టిడ్కో గృహ సముదాయం ఉంది. ఇక్కడ తొలిఫేజ్‌లో 1152ఇళ్లు నిర్మించగా వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. రెండో ఫేజ్‌లో 800 ఫ్లాట్లు నిర్మించగా లబ్ధిదారులకు అందించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం జరిగినా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిపట్ల పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీంతో ఇప్పటివరకు తాగునీటి పైప్‌లైన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదు. ఈ సముదాయంలోని వాటర్ సంప్ పరిసరాలు అపరిశుభ్రంగా మారగా, సీవేజ్ వాటర్ డ్రెయిన్ దెబ్బతింది. ఇక ఏ వస్తువు కావాలన్నా దూర ప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు మహిళా మార్ట్ భవనం నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది.



వాలుతిమ్మాపురంలో ఎదురుచూపులే..

పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వాలుతిమ్మాపురంలో నిర్మించిన టిడ్కో భవనాలు రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మొదటి విడతలో 1724 ఇళ్లను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. రెండో విడతలో 1672 ఇళ్లను నిర్మించింది. ఈలోపు వైసీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. దీంతో రెండో విడతలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించలేదు. 500 ఇళ్లకు వైరింగ్ చేయాల్సి ఉంది.

కొవ్వూరులో అసౌకర్యాల చెరలో టిడ్కో ఇళ్లు



కొవ్వూరు,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి):గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో గృహాలు ఇప్పటికీ లబ్ధిదారులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. మెరుగైన వసతులతో ఈ గృహాల నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుగా వాటిని పక్కనపెట్టేసింది. దీంతో ఆ భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా మారింది. కొవ్వూరు మునిసిపాలిటీ పరిధిలోని పెద తాళ్లపుంతలోని ఎన్టీఆర్ నగర్‌లో 2018లో రూ.31.27 కోట్ల వ్యయంతో 480 గృహాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 300 చదరపు అడుగుల సింగిల్ బెడ్‌రూమ్ గృహాలు 240, 430 చదరపు అడుగుల డబుల్ బెడ్ రూమ్ గృహాలు 240 నిర్మాణం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు గృహ నిర్మాణాలు పూర్తికాగా, తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకుండానే బ్యాంకు వాయిదాలు కట్టుకోవాల్సిన వస్తోందన్నారు. తక్షణం వాటిని లబ్ధిదారులు అప్పగించాలని కోరారు. కాగా కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ జూన్ 12 నాటికి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు.

నిడదవోలులో మోక్షం ఎప్పుడో..



నిడదవోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిడదవోలు పట్టణంలోని తీరుగూడెంలో 1152 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టింది. తుది దశలో ఉండగా ఎన్నికలు రావడం, తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు మూలనపడింది. వైసీపీ ఐదేళ్లూ పట్టించుకోకపోవడంతో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తిరిగి చంద్రబాబు సీఎం అయితే తమకు ఇళ్లు దక్కుతాయని లబ్ధిదారులు ఎదురుచూశారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలైనా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం, మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి ప్రగతి లేదు. దీంతో లబ్ధిదారులంతా తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు.

అగ్నివీర్ దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 10

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అగ్నిపథ్ పథకం 2025-26 కింద అగ్నివీర్ ఉద్యోగాలకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. అగ్నివీర్ కోసం ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ ఉంటుందని, దానికి ఈనెల 10వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ 10వ తరగతి, ట్రేడ్స్ మ్యాన్‌కి 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైటులో నోటిఫికేషన్ అందుబాటులో ఉందన్నారు. అగ్నివీర్ ఎంపిక రెండు దశల్లో జరుగుతుందన్నారు.



ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గౌరవాధ్యక్షుడు మధు

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి

- తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మధు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆప్కాస్ పారిశుధ్య కార్మికులు 60 ఏళ్లు నిండితే వారి కుటుంబ పోషణకు అనుగుణంగా వారిస్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, శ్రామిక మహిళా ఫోరం జిల్లా కన్వీనర్ పి.లావణ్య, వి.కొండలరావు, అల్లం వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో సమూల మార్పులు

- సెకండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం
- ఈనెల 7 నుంచి ఫస్టియర్‌లోకి ప్రవేశాలు
- హాల్‌టికెట్ ఆధారంగా అడ్మిషన్లు
- సిలబస్ మార్పు

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

ఇంటర్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చింది. తరగతుల నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు నూతన సిలబస్‌ను అమల్లోకి తీసుకురానున్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారికి హాల్‌టిక్కెట్ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నారు. నూతన విధానంలో భాగంగా గత మంగళవారం నుంచే ఇంటర్ సెకండియర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ముందస్తు ప్రణాళికలతో ఈసారి సిలబస్ నడుస్తుండడం గమనార్హం. గతంలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసిన విద్యార్థులకు వేసవి సెలవులు అనంతరమే సెకండియర్ తరగతులను ప్రారంభించేవారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. జూన్‌లో ప్రారంభమయ్యే ఇంటర్ విద్యా సంవత్సరాన్ని ఇక నుంచి ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించేలా అకడమిక్ క్యాలండర్ రూపొందించి అమల్లోకి తెచ్చారు. తొలిరోజు కళాశాలల్లో హాజరు అంతంత మాత్రంగానే ఉన్నా బుధవారం నుంచి హాజరు శాతం పెంచేందుకు లెక్చరర్లు ప్రయత్నిస్తున్నారు. సిలబస్ ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ విద్యార్థిమిత్ర కిట్లు కింద పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేయనున్నారు. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఇచ్చి జూన్ 2న మళ్లీ తరగతులు ప్రారంభిస్తారు.

ప్రైవేటుకు దీటుగా అడ్మిషన్ల ప్రక్రియ

ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రైవేటుకు దీటుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదోతరగతి పరీక్షలు పూర్తి కావడంతోనే ప్రైవేటు కళాశాలలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఇదే విధానాన్ని ప్రభుత్వ అధీనంలోని కళాశాలల్లో పాటించాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించి అన్ని కళాశాలలకు ఆదేశాలు జారీచేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల హాల్‌టిక్కెట్టు ఆధారంగా ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. అడ్మిషన్ల ప్రక్రియను 7వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకుగాను టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని లెక్చరర్లు ప్రచారం నిర్వహించనున్నారు.

సిలబస్‌లో మార్పులు

ఇంటర్ విద్యా విదానంలో సమూల మార్పులు తెస్తున్న ప్రభుత్వం సిలబస్‌ను మార్చాలని నిర్ణయించింది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇందుకు నూతన పుస్తకాలు త్వరలోనే కళాశాలలకు చేరనున్నాయి. ఈ సిలబస్ వల్ల ఎంబైపీసీ కోర్సు కొత్తగా అందుబాటులోకి రానుంది. ఇదే సమయంలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించే 7 నుంచే బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తారు.

అకడమిక్ క్యాలెండర్ ఇలా..

ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించిన నేపథ్యంలో అకడమిక్ క్యాలెండర్‌ను ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 23 వరకూ ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించి 24 నుంచి జూన్ 1 వరకూ వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 2న ఇం టర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూలై 17నుంచి 19 వరకూ యూనిట్ 1 పరీక్షలు, ఆగస్టు 18 నుంచి 20 వరకూ యూనిట్-2 పరీక్షలు, సెప్టెంబరు 15నుంచి 20 వరకూ క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా సెలవులు ఉండనున్నాయి. అక్టోబరు 22 నుంచి 24 వరకూ యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకూ హాఫ్ ఇయర్లీ పరీక్షలు, డిసెంబరు 15 నుంచి 20వరకూ ప్రీఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 10నుంచి 18 వరకూ సంక్రాంతి సెలవులు ఇస్తారు. జనవరి 21నుంచి 28 వరకూ ప్రీఫైనల్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇదే నెలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి మొదటి లేదా రెండోవారంలోనే పరీక్షలు పూర్తి చేస్తారు. ఇంటర్ విద్యాసంవత్సరానికి 2026, మార్చి 18న ఆఖరి పనిదినంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇంటర్ విద్యా సంవత్సరంలో మార్పులకు అనుగుణంగా గతంలో 215గా ఉన్న పనిదినాలు 235 రోజులకు పెరగనున్నాయి.

జామాయిల్ తోట దగ్ధం
● రూ. లక్ష ఆస్తినష్టం

దేవరపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దేవరపల్లికి చెందిన మల్లపురాజు దుర్గకు చెందిన రెండెకరాల జామాయిల్ తోట బుధవారం దగ్ధమైంది. రూ. లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్టు కాల్చి పారవేయడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని ఫైర్ అధికారి ఏవీఎస్ఎస్ వేణు తెలిపారు.

ప్రతి బుధవారం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్
● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నియోజకవర్గ కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజలు రాతపూర్వకంగా అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు విషయాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆళ్ళ హరిబాబు, చావా శ్రీనివాస్, సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, యనమదల శివరామకృష్ణ, సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి పాదయాత్రగా..


రావూరుపాడు నుంచి ర్యాలీగా వెళ్తున్న భక్తులు

తాళ్లపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా రావూరుపాడు నుంచి భద్రాచలంలోని శ్రీరాముడి సన్నిధికి పాదయాత్రగా 150 మంది భక్తుల బృందం బుధవారం బయలు దేరింది. ప్రతి సంవత్సరం ఇలా పాదయాత్రగా వెళ్లటంతోపాటు గోటితో వడ్లను వలిచిన బియ్యాన్ని సీతారాముల కల్యాణ తలంబ్రాలు కోసం వెంట తీసుకుని వెళ్తారు. పాదయాత్రలో రేకపల్లి వీరవెంకటరావు, బసవా సత్యనారాయణ, అరిగెల సోమరాజు, నులకాని శ్రీనివాస్,జక్కుల భద్రం, తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిషనర్, బ్యాంకర్లు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వరంగ బ్యాంకర్లు ఆన్‌లైన్‌లో బీసీ 27, బీసీ జనరిక్ మెడికల్ షాపులకు 2, కాపు 25, బ్రహ్మణ 2, వైశ్య 1, రెడ్డి 1, కమ్మ 2, ఈబీసీ 2 కార్పొరేషన్ల ద్వారా రుణాలకు మొత్తం 68 యూనిట్లకు గాను దరఖాస్తు చేసుకున్న 721 మంది లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్, కుమ్మరి గ్రూప్ స్కీమ్ పథకంలో ఐదు యూనిట్లు కేటాయించగా ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేదు.కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, కెనరా బ్యాంకు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో ఓసీ, బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 65 యూనిట్లు కేటాయించగా, 651 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తాళ్లపూడి యూనియన్ బ్యాంక్, ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్, అన్నదేవరపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంగిడి యూనియన్ బ్యాంక్,


తాళ్లపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

ధర్మవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మొత్తం 486 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

చాగల్లు: బీసీ, ఓసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు


చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, చంద్రవరం, మల్లవరం, చిక్కాల, ధారవరం, గౌరిపల్లి గ్రామాల నుంచి 317 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 265 మంది హాజరయ్యారు. ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, ఎంపీపీ మట్టా వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కలవలపల్లి, మార్కొండపాడు, నందిగంపాడు, ఎస్.ముప్పవరం, ఊనగట్ల గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఇంటర్వ్యూలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

ప్రముఖ దాత రామకృష్ణకు సత్కారం


రామకృష్ణను సత్కరిస్తున్న తాడిపర్రు గ్రామస్థులు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రుకి చెందిన ప్రముఖ దాత, సామాజిక సేవా కార్యకర్త గారపాటి రామకృష్ణ ఉగాది సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారాన్ని పొందిన సందర్భంగా బుధవారం ఆ గ్రామస్థులు అతన్ని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, గ్రామపెద్దలు నిడదవోలు సత్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణ, వాకలపూడి సత్యనారాయణ, గారపాటి చిన్నారావు, బండి రామచంద్రం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జనవాణి' : మంత్రి


జనవాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాం స్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని పలు శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ


ఉండ్రాజవరంలో శాంతి ర్యాలీలో ప్రవీణ్ అభిమానులు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని బుధవారం ఉండ్రాజవరంలో గ్రేస్ పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్లు, ప్రవీణ్ అభిమానులు శాంతి ర్యాలీ నిర్వహించారు. వెంటనే పాస్టర్ కుటుంబానికి న్యాయం చేసాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు కె.షారోన్‌రాజు, ఉపాధ్యక్షుడు టి. అబ్బులు, జాయింట్ సెక్రటరీ సుధాకర్, పాస్టర్లు టి. సాల్మన్, దేవసహాయం, పలువురు పాస్టర్లు, పాస్టర్ ప్రవీణ్ అభిమానులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి .. సర్దార్ పాపన్న గౌడ్


పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి సర్దార్ పాపన్న గౌడ్ అని గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు అన్నారు. బుధవారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జి సెంటర్‌లో పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం గౌరవాధ్యక్షుడు మన్నెం సన్నిబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యతోనే ఆర్థికస్థితిగతులను మార్చుకోగలమన్నారు. తాతా కృష్ణారావు మాట్లాడుతూ రాజ్యాంగపరమైన హక్కులను ఐక్యతతో సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, పాకా జయరాం, మార్గాని ఆదినారాయణ, బొర్రా కృష్ణ, కొండేటి భీమారావు, ఎం. చంటిబాబు, సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఝాన్సీరాణి, చిన్న, శ్రీను, ఎం. సూర్యప్రకాశరావు, ఎం. మురళి, దుర్గాప్రసాద్, సగేష్ పాల్గొన్నారు.

కేసును ఛేదించిన పోలీసులు
● నల్లజర్ల హత్య ఘటనలో తండ్రీ, కొడుకు అరెస్ట్

నల్లజర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో సోమవారం రాత్రి సంచలనం రేపిన హత్య కేసును పోలీసులు బుధవారం ఛేదించారు. పేరం శివ (27)ను కత్తులతో నరికి దారుణంగా హత్య చేసిన ఘటనలో బావమరది రేగుల శ్రీరామ్, మామ వెంకన్నను బుధవారం అరెస్టు చేసినట్టు సీఐ రాంబాబు తెలిపారు. కుటుంబ కలహాలతో తమ కూతురుని శివ తరచూ తిట్టడం, కొట్టడం చేసేవాడని, ఆ కోపంతోనే హత్య చేసినట్టు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

ఉండ్రాజవరంలో ఉచిత గుండె వైద్యశిబిరం


శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరంలోని వృద్ధాశ్రమంలో బుధవారం విజయవాడకు చెందిన వైవీరావు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 110 మంది రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. పది మంది తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుండడంతో విజయవాడ ఆసుపత్రికి రావాలని సూచించారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఏడాదిపాటు ఉచితంగా మందులు అందజేస్తామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు కుడప చక్రపాణి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంగిడిలో 'తిరుమల' నూతన బ్రాంచ్ ప్రారంభం


బ్రాంచ్‌లో పూజ చేస్తున్న నున్న చైర్మన్ తిరుమలరావు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడిలో తిరుమల విద్యాసంస్థ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించింది. బుధవారం నూతన భవనంలో చైర్మన్ నున్న తిరుమలరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ మొట్టమొదటి బ్రాంచ్‌ను రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో స్థాపించామని, ఆ తర్వాత విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట, తణుకులో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నూతన శాఖను పంగిడిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికీ అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యాసంస్థను స్థాపించామన్నారు. కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లుల్లోని పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు పంగిడి, కాపవరం జంక్షన్ వద్ద నూతన శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి, జూనియర్ ఇంటర్ (డేస్కాలర్) వరకు ఉంటుందన్నారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం, కొయ్యలగూడెం చుట్టుపక్కల గల అన్ని ప్రాంతాల నుంచి బస్సుసౌకర్యం కలదన్నారు. అడ్మిషన్లకు ఫోన్ నెంబర్లు 8096397777, 8096497777 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,మాజీమంత్రి కేఎస్ జవహర్, డాక్టర్ సాంబశివరావు, తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి. సతీష్‌బాబు, ప్రిన్సిపల్ యు.శ్రీహరి, చాగల్లు, పంగిడి, కొవ్వూరు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, తిరుమల విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ శాశ్వత భవన నిర్మాణానికి కృషి


బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో 9వ అదనపు జిల్లా అనురాధ, న్యాయమూర్తులు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ భవన నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా సహకారం అందించాలని నూతన అధ్యక్షుడు వ్రే నాగ మురళీకృష్ణ అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. దీనికి హాజరైన 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ మాట్లాడుతూ బెంచ్, బార్ రిలేషన్‌ను కొనసాగించాలన్నారు. న్యాయవాదుల సమస్యలుంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు బార్ అసోసియేషన్‌కు శాశ్వత భవన నిర్మాణానికి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. నూతన అధ్యక్షుడిగా వ్రే నాగ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ముంగమూరి నాగమణి, కార్యదర్శిగా రాజాన సత్యనారాయణ (శ్రీనివాస్), ట్రెజరర్‌గా టి. రవీంద్ర, లేడీ రిప్రజెంటేటివ్‌గా గంధం శిరీష, జాయింట్ సెక్రటరీగా పి. ఆనంద్, స్పోర్ట్ కార్యదర్శిగా జె. భరత్ ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ న్యాయవాదులు నీరుకొండ సూర్యనారాయణ, కోడూరి రాఘవులు, ఏలూరి గోపాలకృష్ణ, టీఎన్‌వీ రమణమూర్తి, షైగాపుల పరమేష్, యాగంటి చలపతి, తక్కెళ్ల చిట్టిబాబు, బొబ్బా భారతి, గర్రే శ్రీనివాస్, పులగుర్త శర్మ, వి.ఆర్.వి ప్రసాద్, వై. ప్రకాష్, కె. సన్యాసిరావు, తదితర న్యాయవాదులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు.

దేవరపల్లిలో భారీ అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ఉగాది మహోత్సవాలు ముగింపు సందర్భంగా దేవరపల్లి గ్రామదేవత కడియాలమ్మ ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కైరం అప్పారావు, కాట్రు భీమరాజు, ఉప్పులూరి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు ఇస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు

● ఆగంతకుల గుర్తింపు, నేరాల నియంత్రణకు ఎంతగానో దోహదం
● కెమెరాల ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ విశ్వం

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నేరాలు ఛేదించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణగా ఇటీవల కొవ్వూరు పట్టణంలో బంగారు వ్యాపారి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి బీరువాలో ఉన్న 40 కాసుల బంగారు వస్తువులు దొంగిలించుకుని, యాక్టివా బైక్ తీసుకుని పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి అరెస్టుచేశారు. ఆయన్నుంచి 40 కాసుల బంగారు వస్తువులను రికవరీ చేశారు. అలాగే ఫిబ్రవరి నెలలో కొవ్వూరు 23వ వార్డు చెందిన మహిళ సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని యువకుడు వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న ఆరున్నర కాసుల బంగారు గొలుసు దొంగిలించుకుని బైక్‌పై పారిపోయాడు. ఈ కేసులోనూ పోలీసులు పూర్తిగా సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి బంగారు గొలుసును రికవరీ చేశారు. దీనిపై కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం మాట్లాడుతూ పట్టణ పోలీస్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణకు వ్యాపారస్తులు, ఆలయాల నిర్వాహకులకు సమావేశాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పట్టణ పరిధిలో సుమారు 200 ప్రైవేట్ సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు. అలాగే అవంతి ఫ్యాక్టరీ యాజమాన్యం 50 కెమెరాలు, ఆటో యూనియన్ సభ్యులు 20 కెమెరాలు, బంగారు వర్తకులు 10 కెమెరాలు అందించారన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశామన్నారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు : ఎమ్మెల్యే



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల అర్హులైన పేదలు చాలా మందికి రేషన్ కార్డులు లేకుండాపోయాయని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారు దూరమయ్యారని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన లోటుపాట్లు వెలికి తీసి అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించిందని, సమగ్రంగా పరిశీలించిన తరువాత కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. రేషన్‌కార్డులు ఏటీఎం కార్డు సైజుల్లో రాబోతున్నాయన్నారు. స్మార్ట్‌కార్డుల రూపంలో కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈనెల 30తో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త రేషన్‌కార్డులు జారీ ప్రక్రియకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు.

గురుకుల విద్యాలయాల్లో స్థిరమైన టైం టేబుల్ అమలు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాలయాల్లో కిందిస్థాయి అధికారులు ప్రతి ఏటా టైంటేబుల్ మార్చడం వల్ల స్టాండర్డు ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) కార్యక్రమాలు అమల్లో చురుకుదనం లోపిస్తున్నదని, ఈ పరిస్థితుల్లో ఒక స్థిరమైన టైం టేబుల్ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మీనారాయణ, పి.చిన్నయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యావిధానంలో మార్పులు తేవడానికి జీఓ ఎంఎస్ నెం.46 విడుదల చేసిందని, దీని ప్రకారం ఉదయం 7.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టైం టేబుల్ ఇచ్చారని తెలిపారు. అయితే, ఈ టైం టేబుల్ ప్రతిఏటా మార్చడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నందున, ఈ టైం టేబుల్‌ను ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4.15 వరకు అమలు చేయాలని కోరుతున్నామని వారు పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్ల అందజేత


ఉప్పరగూడెంలో ట్రై సైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

గోపాలపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉప్పరగూడెంకి చెందిన విభిన్న ప్రతిభావంతు దంపతులైన పాతకాపుల వెంకటరమణ, గంగమ్మకు ట్రైసైకిల్ ఇప్పించాలంటూ ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కూనపోము ప్రసాద్‌బాబు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకువెళ్లారు. భార్యా భర్తలిద్దరూ దివ్యాంగులు కావడంతో స్పందించిన ఎమ్మెల్యే రూ. 50 వేల విలువ గల బ్యాటరీ అమర్చిన మూడు చక్రాల సైకిల్‌ను బుధవారం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కొడవటి గంగరాజు, పల్లిపూడి సుబ్బారావు, వెంకటేష్, బాలాజీ, నూతంగి శ్రీను. దావీదు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన విభిన్న ప్రతిభా వంతులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తన జీతంతోపాటు సొంత నిధులతో బ్యాటరీ సాయంతో నడిచే మూడు చక్రాల సైకిళ్లను నలుగురికి బుధవారం అందజేశారు. ప్రకాశరావుపాలెంలో యద్దనపూడి బ్రహ్మరాజు కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, వల్లూరి సత్తిపండు, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్,షేక్ మీరా, కూచిపూడి ఉదయభాస్కర్, గుదే సుబ్బారావు పాల్గొన్నారు.


ప్రకాశరావుపాలెంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

వెంకటేశ్వర నగర్ పార్కులో చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న కేఎస్ఎల్ హాస్పిటల్ అధినేత కీర్తి సుబ్బారావు, తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర నగర్ పార్కులో జవహర్ వాకర్స్ క్లబ్ వారిచే ఏర్పాటు చేయబడిన చలివేంద్రాన్ని కేఎస్ఎల్ హాస్పిటల్ అధినేత కీర్తి సుబ్బారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ క్లబ్ తరపున ప్రతీ సంవత్సరం వేసవిని దృష్టిలో ఉంచుకుని, శుద్ధి చేసిన మినరల్ వాటర్‌ను మంచినీటి కుండల ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు వాసు, రాఘవరెడ్డి, క్లబ్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.